


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 200 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : కాకినాడ గురువారం 27 మార్చి 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :200 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA THU 27 MARCH 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

# హామీ నెరవేరింది... సంతోషంగా ఉంది

- పిఠాపురం ప్రాంతంలో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు, అనుమతులు మంజూరు
- బ్రిడ్జ్ నిర్మాణానికి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చానన్న పవన్
- నిర్మాణం పూర్తయితే ప్రజల కష్టాలు తీరుతాయని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం ప్రాంతంలో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి రూ. 59.70 కోట్లు మంజూరయ్యాయి. నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో పవన్ స్పందిస్తూ... తనకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఎన్నికల సమయంలో తాను ఈ రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చానని గుర్తు చేశారు. ఉప్పాడ-సామర్లకోట రహదారిలో రైల్వే క్రాసింగ్ కారణంగా ప్రజలు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పవన్ చెప్పారు. ఈ బ్రిడ్జ్ పూర్తయితే వాహన రాకపోకలు సులభతరం అవుతాయని... ప్రజల ప్రయాణ సమయం సులభతరం అవుతుందని అన్నారు. కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి 'సేతు బంధన్' పథకంలో భాగంగా ఈ నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలిపారు. నిధులు మంజూరు చేసిన ప్రధాని మోదీ, కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. వంతెన నిర్మాణం త్వరగా పూర్తికావాలని ఆశిస్తున్నానని తెలిపారు.



## పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతి... చంద్రబాబు కీలక ఆదేశాలు



- రాజమండ్రి శివారులో రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి
- పాస్టర్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ క్రైస్తవ సంఘాల ఆందోళన
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలంటూ చంద్రబాబు ఆదేశం

**పెన్ పవర్ డెస్క్:**రాజమండ్రి శివారులో పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతిపై వస్తున్న ఆరోపణలపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. పాస్టర్ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరపాలని ఆదేశించారు. ఈ ఘటనపై రాష్ట్రం హోం మంత్రి అనిత తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ కు ఫోన్ చేసి ఘటనపై ఆరా తీశారు.

వివరాలు 2లో..

## జపాన్ ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం



**పెన్ పవర్ డెస్క్:**రాజధాని అమరావతిలో ఈరోజు జపాన్ రాయబారి కెయిచి ఓనో నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో సమావేశమైనట్లు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ భేటీలో పరస్పర సహాయసహకా రాలపై కీలక చర్చ జరిగినట్లు ముఖ్యమంత్రి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు.

"ఈరోజు అమరావతిలో జపాన్ రాయబారి కెయిచి ఓనో నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో సమావేశమయ్యాం. ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడం, ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ పెట్టుబడులను విస్తరించడంపై చర్చలు జరిగాయి. వృద్ధికి కొత్త అవకాశాలను అందించడానికి నౌకానిర్మాణం, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ఆటోమొబైల్స్, విద్య వంటి వివిధ రంగాలలో సహకారాన్ని అన్వేషించడంపై మా చర్చలు కొనసాగాయి" అని సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఏపీ హైకోర్టులో తాత్కాలిక ఊరట

- వైసీపీ హయాంలో లిక్కర్ స్కామ్ పై సీఐడీ కేసు నమోదు
- మిథున్ రెడ్డిని నిందితుడిగా చేర్చిన సీఐడీ
- ఏప్రిల్ 3 వరకు మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దన్న హైకోర్టు




**పెన్ పవర్ డెస్క్:**ఏపీ లిక్కర్ వ్యవహారంలో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేస్తారంటూ కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. వైసీపీ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని సీఐడీకి ఫిర్యాదులు అందాయి. దీంతో సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. మిథున్ రెడ్డిని నిందితుడిగా చేర్చారు. దీంతో, ఆయన

వివరాలు 2లో..

## చంద్రబాబుకు మెసేజ్ చేసినా రెస్పాన్స్ రాలేదు



- రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పాస్టర్ ప్రవీణ్ కు పోస్టుమార్టం
- కేసును సీబీఐకి అప్పగించాలన్న కేఏ పాల్
- ప్రవీణ్ మృతిపై అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**రాజమండ్రి శివార్లలో జరిగిన ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతదేహానికి రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మరోవైపు ఆసుపత్రి వద్దకు చేరుకున్న

వివరాలు 2లో..

## రాహుల్ గాంధీ వల్ల కాంగ్రెస్ కంటే బీజేపీకే ఎక్కువ లాభం

- రాహుల్ ఉద్దేశాన్ని ప్రజలు గ్రహిస్తున్నారన్న యూపీ ముఖ్యమంత్రి
- విదేశాల్లో భారతదేశంపై ఆయన చేసే విమర్శలు గమనిస్తున్నారని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వల్ల కాంగ్రెస్ కంటే బీజేపీకే ఎక్కువ ప్రయోజనమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. ప్రతిపక్షంలో అలాంటి నేత ఒకరు ఉంటే

వివరాలు 2లో..



## హిందీ, ఇంగ్లీష్‌లో మాట్లాడలేను.. నేను తెలుగు బిడ్డను

- తెలుగు రాష్ట్రంలో ఎక్కడో గూడెంలో పుట్టానన్న సీతక్క
- తనకు హిందీ, ఇంగ్లీష్ రాదని చెప్పడం సరికాదన్న సీతక్క
- అక్బరుద్దీన్ ఒవైసీని ఉద్దేశించి మంత్రి సీతక్క వ్యాఖ్యలు



**పెన్ పవర్ డెస్క్:**"నేను తెలుగు గడ్డ మీద పుట్టాను. నా మాతృభాష తెలుగు. అందుకే నేను హిందీ, ఇంగ్లీష్‌లో మాట్లాడలేను. నేను తెలుగు వ్యక్తిని" అని తెలంగాణ మంత్రి సీతక్క శాసనసభలో అన్నారు. మజ్లిస్ పార్టీ శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్

## గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

- రాష్ట్రాలు చట్టాలు చేసుకోవచ్చునని స్పష్టం చేసిన అశ్వినీ వైష్ణవ్
- కేంద్రం నైతికతను ప్రశ్నించే హక్కు లేదన్న కేంద్ర మంత్రి
- రాష్ట్రాల పరిధిలోని అంశమే అయినా కేంద్రం చర్యలు తీసుకుంటోందని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**కేంద్ర ప్రభుత్వం గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై కీలక ప్రకటన చేసింది. ఈ అంశాలకు సంబంధించి రాష్ట్రాలు చట్టాలు చేసుకోవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో వెల్లడిం చారు. వీటిని కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుం టుందని ఆయన తెలిపారు.

వివరాలు 2లో..

## మేడిగడ్డ బ్యారేజీ, ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన

- ఎన్డీఎస్ఏ తుది నివేదిక వచ్చాక మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులపై దృష్టి సారిస్తామన్న మంత్రి
- కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో లోపాలు ఉన్నాయన్న మంత్రి
- ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం తాత్కాలిక ఎదురుదెబ్బ అన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

**పెన్ పవర్ డెస్క్:**మేడిగడ్డ బ్యారేజీకి సంబం ధించిన విజిలెన్స్ నివేదిక అందినట్లు మంత్రి ఉత్తమ్ కు మార్ రెడ్డి తెలిపారు. ఎ న్డీఎస్ఏ తుది నివేదిక అంది న వెంటనే మరమ్మతులపై దృష్టి సారిస్తామని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో బడ్జెట్‌పై

వివరాలు 2లో..



## తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ కు మార్చి 31 వరకే అవకాశం

- ఇప్పటివరకు పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలన్న మంత్రి నాదెండ్ల
- ప్రతి పేద ఆడబిడ్డకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు
- ఇప్పటివరకు 98 లక్షల మంది తొలి ఉచిత సిలిండర్ వినియోగించుకున్నారన్న మంత్రి



**పెన్ పవర్ డెస్క్:** ప్రతి పేద ఆడబిడ్డకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని, దీపం-2 పథకంలో తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉందని ఆహారం పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలన్నారు. కాగా, ఇప్పటివరకు 98 లక్షల మంది తొలి ఉచిత సిలిండర్ వినియోగించుకున్నారని ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల తెలిపారు.ఏపీలో సూపర్ సిక్స్ హామీ నిలబెట్టుకుంటున్న కూటమి సర్కార్ 2024 నవంబర్ 01న ముఖ్యమంత్రి

వివరాలు 2లో..

## కాళేశ్వరం ప్రాజెక్టు ఎనిమిదో ప్రపంచ వింత అని ప్రచారం చేయించారు



**పెన్ పవర్ డెస్క్:**కాళేశ్వరం ప్రాజెక్టును ఎనిమిదో ప్రపంచ వింతగా పెయిడ్ ప్రచారం చేయించారని, ఆ ప్రాజెక్టుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆరే ఇంజినీర్ అని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు విమర్శించారు. శాసనసభలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లూజ్ సాయిల్, లూజ్ ఫౌండేషన్ మీద కాళేశ్వరాన్ని నిర్మించడం పెద్ద తప్పని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్, హరీశ్ రావును క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టి శీల పరీక్ష నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

- కాళేశ్వరం ప్రాజెక్టుకు కేసీఆరే ఇంజినీర్ అని విమర్శ
- మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- లూజ్ సాయిల్, లూజ్ ఫౌండేషన్ మీద కాళేశ్వరాన్ని నిర్మించడం తప్పన్న బీజేపీ ఎమ్మెల్యే

## ఎడిటర్ వ్యూ

# పొంచి ఉన్న ఆయిల్ సంక్షోభం...

పశ్చిమాసియాలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా భారతీయ వాణిజ్య రంగానికి సంక్షోభం తప్పదు. చమురు, సహజ వాయువు, ఎరువులు, తదితర ముఖ్య అవసరాలు సరిగ్గా సరఫరా కాక, వాణిజ్యంలోనే కాదు, ప్రజల జీవన విధానంలో కూడా ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా చమురు సంక్షోభం సంభవిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర ఒక్కసారిగా పెరిగిపోతుంది. మనకు ఎఉ?కవగా చమురును, గ్యాస్‌ను సరఫరా చేసేది రష్యా, ఇరాన్ దేశాలే. ఆయా దేశాల నుంచి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే మన దేశం భారీగా అంతర్జాతీయ మార్కెట్‌కు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో రష్యా నుంచి మనదేశానికి ముడి చమురు దిగుమతులు రోజువారీ సరాసరిన (మిలియన్ పెర్ డే) 1.41 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశం. జనవరి నాటికి రోజువారీ 1.49 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోగా అంతకన్నా ఇప్పుడు తగ్గడం గమనార్హం. కార్గో ట్రాకింగ్ ఏజెన్సీ వోర్టెక్స్ వివరాల ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో రోజువారీ మొత్తం 4.77 మిలియన్ బ్యారెళ్లుగా చమురు దిగుమతులు జరిగాయి. జనవరిలో రోజువారీ మొత్తం 4.76 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతులు కాగా పెద్దగా మార్పు లేదు. అయితే ఈ మార్చి, ఏప్రిల్ నెలల్లో మరింతగా చమురు దిగుమతులు క్షీణిస్తాయని వోర్టెక్స్ చెబుతోంది. దీనికి కారణం అమెరికా ఆఫీస్ ఆఫ్ ఫారెస్ అసెట్స్ కంట్రోల్ (ఒఎఫ్‌ఎసి) జనవరి 10 న విధించిన ఆంక్షలే.అయితే ఈ లోటును పశ్చిమాసియా దేశాలు భర్తీ చేస్తాయని ఎపిఎసి అనాలిసిస్ వోర్టెక్స్ అధినేత ఇవాన్ మేథ్యూ వెల్లడించారు. రష్యా చమురు ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సర్గుట్ నెఫ్ట్ గ్యాస్‌లతో పాటు దాదాపు 180 ట్యాంకర్లపై తాజాగా జనవరి 10న అమెరికా ఆంక్షలు విధించింది. రష్యాకు రెవెన్యూ రాకుండా అడ్డుకోవడమే దీని వెనుక ఉన్న ఆంతర్యం. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగించడానికే రష్యా ఈ ఆదాయాన్ని ఖర్చు పెడుతోందని అమెరికా ఆరోపిస్తోంది. ఫలితంగానే రష్యా చమురు కార్గో నౌకలు ఫిబ్రవరి 27 నాటికి అమెరికా ఆంక్షల సుడిలో చిక్కుకోవలసి వచ్చింది.2024 మొదటి ఏడు మాసాలు (జనవరి జులై) ఇజ్రాయెల్, జోర్డాన్, లెబనాన్ దేశాలకు భారత్ నుంచి వాణిజ్యంలో సంఘర్షణలు తప్పలేదు. భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు 63.3 శాతం వరకు ఎగుమతులు పతనమయ్యాయి. దీని విలువ 1.3 బిలియన్ డాలర్లు. ఆర్గానిక్ కెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, డైమండ్స్, ఎగుమతులకు గండి పడిందని వాణిజ్య విభాగం వెల్లడించింది. అలాగే జోర్డాన్‌కు ఎగుమతుల్లో 38 శాతం అంటే 638 మిలియన్ డాలర్ల వరకు, లెబనాన్‌కు 7% అంటే 198 మిలియన్ డాలర్ల వరకు ఎగుమతులు పతనమై భారత్‌కు నష్టాలు సంభవించాయి.2024 వరకు అంతకు ముందు ఏడేళ్లుగా ఏటా 3% వంతున ముడిచమురు ఉత్పత్తిలో తగ్గుదల కనిపిస్తోంది. ఉత్పత్తిలో తగ్గుదల ఉంటున్నా వినియోగం పెరుగుతుండడంతో భారత్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తోంది. 2017 నుంచి 2024 వరకు 86 నుంచి 89 శాతం వరకు దిగుమతులపైనే దేశం ఆధారపడవలసి వచ్చింది. భారత ఇంధన వినియోగ చిత్ర 2024 ఆర్థిక సంవత్సర నివేదికలో ఇదో భాగం. దేశం ఇంధనాన్ని సేకరించడం, ఉత్పత్తి, వినియోగం తాలూకు ఆమూలాగ్ర డేటాను ఈ నివేదిక అందిస్తోంది. కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ నేతృత్వంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బిఇఇ)ఈ నివేదికను రూపొందించింది.2024 ఆర్థిక సంవత్సరంలో మొత్తం సరఫరా అయిన ఇంధనం 910 మిలియన్ టన్నులు కాగా, ఇందులో బొగ్గు నుంచి 60%, చమురు నుంచి 28%, గ్యాస్ నుంచి 7%, శిలాజేతర వనరుల నుంచి 5% సరఫరా అయింది. స్వదేశీ చమురు ఉత్పత్తి 2017 ఆర్థిక సంవత్సరంలో 36 మిలియన్ టన్నులు కాగా, 2024 నాటికి 29.4 మిలియన్ టన్నులకు తగ్గిపోయింది. వార్షిక రేటు 3% వరకు తగ్గుతూ వస్తోంది. ఈ తగ్గుదలకు అనేక కారణాలు దోహదం చేస్తున్నాయి. ఈ కొరతను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 2019లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ లైసెన్సింగ్ (హెచ్‌ఇఎల్‌పి) వంటి ప్రక్రియను అమలుచేసే చర్యలను తీసుకుంది.ఎంపికైన చమురు క్షేత్రాల్లో తగిన సాంకేతిక విధానాలు అమలు చేసి చమురు ఉత్పత్తిని సాధించడమే ఈ విధానం లక్ష్యం. చిన్న, మధ్యతరహా స్థాయిలో చమురు పరిశోధనలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా ఆయా సంస్థలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ నిర్వహణలోని ఒఎన్‌జిసి, ఆయిల్ ఇండియా సంస్థలు క్రమంగా 65 శాతం, 11 శాతం వరకు 20232024 సంవత్సరంలో చమురును అందించగలిగాయి. మిగతా 24 శాతం ముడిచమురు ఉత్పత్తి ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్ట్ (పిఎస్‌సి) లేదా రెవెన్యూ షేరింగ్ కాంట్రాక్ట్ (ఆర్‌ఎస్‌సి) ద్వారా లభించింది. 2024 ఏప్రిల్ 1 నాటికి సమతుల్యతలో తిరిగి పొందగలిగిన చమురు నిల్వలు 671.4 మిలియన్ టన్నులుగా భారత్ అంచనా వేసింది. అంతకు ముందు సంవత్సరం నాటి 669.47 మిలియన్ టన్నుల నిల్వలతో పోల్చుకుంటే 0.3 శాతం ఎక్కువ.స్వదేశీ చమురు ఉత్పత్తి కన్నా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో చమురు దిగుమతులపై ఆధారపడడం మరింత ఎక్కువ అవుతుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద చమురు దిగుమతి దారైన భారత్ 2024లో 234 మిలియన్ టన్నుల చమురును సేకరించుకోగలిగింది. సరఫరా కావలసి చమురులో 86% 2017లోను, 89% 2024 లోనూ దిగుమతి చేసుకోవలసి వచ్చింది. కొవిడ్ మహమ్మారి సమయంలో చమురు దిగుమతులు తాత్కాలికంగా 202122 లో తగ్గాయి. భారీ స్థాయిలో దిగుమతి చేసుకున్నామంటే రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం భారీగా పెరుగుతున్నట్టే భావించక తప్పదు. 2024 ఏప్రిల్ 1నాటికి ఏడాదికి 256.8 మిలియన్ టన్నుల చమురును రిఫైనింగ్ చేసే సామర్థ్యం భారత్‌కు ఉందని తేలింది. దీంతో ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా తరువాత నాలుగో రిఫైనర్‌గా భారత్ నిలుస్తోంది.

# రాహుల్ గాంధీ వల్ల కాంగ్రెస్ కంటే బీజేపీకే ఎక్కువ లాభం

- మొదటి పేజీ తరువాయి

అధికార పక్షం సాఫీగా నడుస్తుందంటూ ఎద్దేవా చేశారు. రాహుల్ చేసిన భారత్ జోడో యాత్రపైనా యోగి విమర్శలు గుప్పించారు. అది భారత్ జోడో యాత్ర కాదని భారత్ థోడో యాత్ర అని విమర్శించారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి అక్కడ మన భారత దేశాన్ని తీవ్రంగా విమర్శిస్తారని, ఆయన వ్యాఖ్యల వెనకున్న మర్మాన్ని ప్రజలు గ్రహిస్తున్నారని వివరించారు. ఈ మేరకు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో యోగి ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ మనస్తత్వాన్ని జనం గుర్తిస్తున్నారని తెలిపారు. ఆయనలాంటి నేతలు ప్రతిపక్షంలో ఉండటం బీజేపీకి ఎంతో లాభిస్తుందని సెటైర్ వేశారు. కాంగ్రెస్ పార్టీ అయోధ్య రామ మందిరం అంశాన్ని వివాదాస్పదం చేయాలని ప్రయత్నించిందని ఆరోపించారు. దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ.. ముస్లిం మహిళల సమస్యలకు పరిష్కారం ఎందుకు చూపలేకపోయిందని యోగి ప్రశ్నించారు. ట్రిపుల్ తలాక్ ను ఎందుకు రద్దు చేయలేకపోయిందని, కుంభమేళాను గర్వంగా ఎందుకు ప్రమోట్ చేయలేకపోయిందని నిలదీశారు. ప్రపంచ దేశాలకు దీటుగా భారత్ ను ఎందుకు నిర్మించలేకపోయిందని యోగి ప్రశ్నించారు.

# తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ కు మార్చి 31 వరకే అవకాశం

- మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు నాయుడు దీపం-2 పథకానికి శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. దీపం-2 పథకంతో ప్రతి పేద వాడి ఇంట్లో దీపపు కాంతులు విరాజిల్లుతున్నాయన్నారు. కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా దీపం-2 పథకం రూపొందించాయని మంత్రి వివరించారు. ఈ సందర్భంగా దీపం-2 పథకానికి రూ.2,684 కోట్లు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ఉచిత సిలిండర్ కావాల్సిన వారు సాధారణ పద్ధతిలో ముందుగా సొమ్ము చెల్లించవలసి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో బుక్ చేసిన 24 గంటల లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల లోపు గ్యాస్ డెలివరీ ఇస్తారు.ఆ తర్వాత సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు చెల్లించిన పూర్తి సొమ్మును లబ్దిదారుల ఖాతాల్లో తిరిగి జమ చేయడం జరుగుతుంది.ఒక సంవత్సరంలో 3 గ్యాస్ సిలిండర్లు ఇలా ఉచితంగా పంపిణీ చేస్తారు. అయితే వీటిని ఒకేసారి కాకుండా నాలుగు నెలలకు ఒకసారి బుక్ చేసుకునే అవకాశం కల్పించారు.

**ప్రతి ఏడాది**

ఏప్రిల్-జూలై (01)

ఆగష్టు-నవంబర్ (01)

డిసెంబర్-మార్చి (01)

మధ్య ఉచిత గ్యాస్ సిలెండర్ బుక్ చేసుకోవచ్చు.

**ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడానికి అర్హతలు**

1)ఎల్.పి.జి.కనెక్షన్ కలిగి ఉండటం

2) రేషన్ కార్డ్

3) ఆధార్ కార్డు

4). ఆధార్ కార్డుతో రైస్ కార్డు అనుసంధానం అయి ఉండాలి

ఎటువంటి సమాచారం లోపం ఉన్న టోల్ ఫ్రీ నెం.1967 కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు.

# వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఏపీ హైకోర్టులో తాత్కాలిక ఊరట

- మొదటి పేజీ తరువాయి

ముందస్తు బెయిల్ కోసం గతంలోనే ఏపీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ ను విచారించిన ఏపీ హైకోర్టు మిథున్ రెడ్డికి తాత్కాలిక ఊరటను కల్పించింది. మిథున్ రెడ్డి పిటిషన్ పై ఏప్రిల్ 3న తీర్పును వెలువరిస్తామని... అంతవరకు ఆయనను అరెస్ట్ చేయవద్దని సీఐడీ పోలీసులను ఆదేశించింది.మరోవైపు, టీడీపీ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు నిన్న లోక్ సభలో ఏపీ లిక్కర్ కుంభకోణం అంశాన్ని లేవనెత్తారు. సభ కొనసాగుతుండగానే కేంద్ర హోం మంత్రి అమిత్ షా కృష్ణదేవరాయలును పార్లమెంట్ లోని తన కార్యాలయానికి పిలిపించుకుని లిక్కర్ స్కామ్ గురించి వివరాలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ పరిణామాలు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తున్నాయి.

# పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతి... చంద్రబాబు కీలక ఆదేశాలు

- మొదటి పేజీ తరువాయి

ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించాలని ఆదేశించారు. రాజానగరం సీఐ వీరయ్యగౌడ్ మాట్లాడుతూ రాజమండ్రి శివారు కొంతమూరు వద్ద రోడ్డు ప్రమాదం జరిగిందని... ఈ ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ మరణించాడని చెప్పారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్ పై బయల్దేరిన ప్రవీణ్... అర్ధరాత్రి సమయంలో ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. రహదారి పైనుంచి ప్రమాదవశాత్తు కిందకు జారిపోయారని... వాహనం అతనిపై పడిపోవడంతో ఆయనకు బలమైన గాయాలయ్యాయని, ఈ ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఉదయం 9 గంటల వరకు ఆయనను ఎవరూ గమనించలేదని తెలిపారు. మరోవైపు, ప్రవీణ్ కుమార్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ క్రైస్తవ సంఘాలు రాజమండ్రిలో ఆందోళన చేపట్టాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు విచారణకు ఆదేశించారు.

# చంద్రబాబుకు మెసేజ్ చేసినా రెస్పాన్స్ రాలేదు

- మొదటి పేజీ తరువాయి

కేఏ పాల్ పోస్టుమార్టం జరుగుతున్న మార్చురీ వద్దకు వెళ్లారు. పోస్టుమార్టం ప్రక్రియను తాను కూడా పరిశీలిస్తానని చెప్పారు. అయితే, పోస్టుమార్టం గదిలోకి అనుమతించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేఏ పాల్ మాట్లాడుతూ... ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్ మృతిపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, హోం మంత్రి అనితకు మెసేజ్ లు చేసినా వారి నుంచి రెస్పాన్స్ రాలేదని తెలిపారు. ప్రవీణ్ మృతిపై క్రైస్తవులకు ఉన్న అనుమానాలను అధికారులు నివృత్తి చేయాలని చెప్పారు. ప్రమాదం ఏ విధంగా జరిగిందో ఆధారాలతో వివరించాలని కోరారు.

# అత్యవసరంగా ల్యాండ్ అయిన యోగి ఆదిత్యనాథ్ విమానం

**ఆగ్రాలోని ఖేడియా విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్**

**టేకాఫ్ అయిన 20 నిమిషాలకే సాంకేతిక సమస్య**

**మరో విమానంలో లక్నోకు వెళ్లిన యోగి ఆదిత్యనాథ్**

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రయాణిస్తున్న ఛార్టర్డ్ విమానం సాంకేతిక లోపం కారణంగా ఆగ్రాలోని ఖేడియా విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది.ఆగ్రా పర్యటనలో ఉన్న యోగి ఆదిత్యనాథ్ మధ్యాహ్నం 3.40 గంటలకు పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. విమానం టేకాఫ్ అయిన 20 నిమిషాల తర్వాత సాంకేతిక సమస్య తలెత్తడంతో పైలట్లు వెంటనే విమానాన్ని వెనక్కి మళ్లించి, ముందు జాగ్రత్తగా ఖేడియా విమానాశ్రయంలో దింపారు.ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కోసం ఢిల్లీ నుండి మరో విమానాన్ని పంపించారు. ఆయన సుమారు గంటన్నర సేపు ఆగ్రా విమానాశ్రయ లాంజ్‌లో వేచి ఉన్నారు. ప్రత్యామ్నాయ విమానం చేరుకున్న తర్వాత లక్నోకు బయలుదేరారు.

# గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

- మొదటి పేజీ తరువాయి

డీఎంకే ఎంపీ దయానిధి మారన్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ, తమిళనాడు ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించిందని, దీనిపై చర్యలు తీసుకోవడంలో కేంద్రం తన నైతిక బాధ్యత నుంచి తప్పించుకుంటోందా అని మారన్ ప్రశ్నించారు.అశ్వినీ వైష్ణవ్ స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వం నైతికతను ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదని అన్నారు. ఈ అంశంపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు రాజ్యాంగం నైతిక, చట్టబద్ధ అధికారాన్ని ఇచ్చిందని స్పష్టం చేశారు. సమాఖ్య నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇది రాష్ట్రాల పరిధిలోని అంశమే అయినప్పటికీ, తమకు అందిన ఫిర్యాదుల ఆధారంగా 1410 గేమింగ్ సైట్లను నిషేధించినట్లు ఆయన తెలిపారు.

# దేశవ్యాప్తంగా యూపీఐ సేవల్లో అంతరాయం

**యూపీఐ సర్వర్ డౌన్**

**తీవ్ర ఇబ్బందులుపడుతున్న వినియోగదారులు**

**గంటకు పైగా నిలిచిన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం సేవలు**




దేశవ్యాప్తంగా యూపీఐ సేవల్లో అంతరాయం ఏర్పడింది. యూపీఐ సర్వర్ డౌన్ కావడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూపీఐ ద్వారా జరిగే ఆన్‌లైన్ సేవలు దాదాపు గంటకు పైగా నిలిచిపోయాయి.ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి సేవలు పనిచేయడం లేదు. పెట్రోల్ బంకులు, హోటళ్లు, రెస్టారెంట్లు మొదలైన వివిధ ప్రాంతాల్లో ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలనుకున్న వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై వినియోగదారులు సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు.సాయంత్రం ఏడు గంటల తర్వాత యూపీఐ సేవల్లో అంతరాయం ఏర్పడింది. యూపీఐపై ఆధారపడిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# మేడిగడ్డ బ్యారేజీ, ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన

- మొదటి పేజీ తరువాయి

చర్చ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు లేవనెత్తిన అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు.కాళేశ్వరం ప్రాజెక్టు ఆనకట్టల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. డీపీఆర్‌లో షీట్ పైల్స్ పేర్కొన్నప్పటికీ, నిర్మాణంలో సీకెంట్ పైల్స్ ఉపయోగించారని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రపంచ స్థాయి నిపుణులను భాగస్వాములను చేసి సహాయక చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన మూడు గంటల్లోనే తాను స్వయంగా అక్కడకు చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించానని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రెండు రోజుల క్రితం పరిస్థితిని సమీక్షించి, సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారని తెలిపారు.

ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం తాత్కాలిక అవరోధమని, దీనిని పూర్తి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఆయన స్పష్టం చేశారు. తమ్మిడిహట్టి

ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన ప్రస్తుతం కొనసాగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. తక్కువ ఖర్చుతో, త్వరితగతిన ఎక్కువ ఆయకట్టుకు నీరందించే ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

# హిందీ, ఇంగ్లీష్‌లో మాట్లాడలేను.. నేను తెలుగు బిడ్డను

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనకు హిందీ, ఇంగ్లీష్ రాదని చెబుతున్నారని, కానీ తాను తెలుగు రాష్ట్రంలో ఎక్కడో గూడెంలో పుట్టానని ఆమె అన్నారు.

**పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఆమోదం**

పంచాయతీరాజ్ సవరణ బిల్లును తెలంగాణ శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. పంచాయతీరాజ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. ఈ బిల్లుపై చాలామంది సభ్యులు విలువైన సూచనలు చేశారని, ఈ బిల్లులో లేని అంశాలను సభ్యులు ప్రస్తావించారని తెలిపారు. సభ్యులు ప్రతిపాదనలు పంపిస్తే పరిశీలిస్తామని ఆమె వెల్లడించారు.రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఆదిలాబాద్ నుంచి అచ్చంపేట వరకు షెడ్యూల్ ఏరియాలో గుర్తించారని, ఆ చట్టాన్ని 1/70గా పిలుస్తారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రత్యేక హక్కులు కల్పించేందుకు, అభివృద్ధి జరిగేందుకు 1/70 చట్టం కృషి చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఏజెన్సీ ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ అయితే అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారని ఆమె అన్నారు.ములుగును మున్సిపాలిటీగా చేసుకుంటున్నామని సీతక్క అన్నారు. ప్రజల అభిప్రాయం, కలెక్టర్లు పంపిన ప్రతిపాదనల ఆధారంగా మున్సిపాలిటీలుగా నవీకరిస్తున్నట్లు తెలిపారు. కొన్ని గ్రామాలు ఒక మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్నాయని, రెవెన్యూ పరంగా మరో మండలంలో ఉంటున్నాయని, ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును మనం ఆమోదించుకున్నామని, కేంద్రం ఆ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తే రిజర్వేషన్లు పెరుగుతాయని అన్నారు. అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు.



పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# ప్రమాదకరంగా పాఠశాల భవనం





- అక్కడే ఆడుకుంటున్న విద్యార్థులు
- క్షణ..క్షణం భయం భయం
- స్పందించని అధికారులు

**కాజులూరు,పెన్‌పవర్,మార్చి26:**ఆ పాఠశాల భవనం శిథిలావస్తకు చేరుకుంది.ప్రస్తుతం ఆ పాఠశాల ప్రమాదపు అంచుల్లో ..విద్యార్థులు,అంగన్వాడీ చిన్నారులు ఆటలాడుతున్నారు.నాడు నేడు ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు.ఎలిమెంటరీ పాఠశాల మరింత శిథిలావస్తకు చేరడంతో ఆ స్కూల్ భవనాన్ని ఖాళీ చేశారు.శిథిలావస్తలో ఉన్న భవనానికి ఆనుకుని కమ్యూనిటీహాల్,అంగన్వాడీ స్కూల్,వరుసగా ఉన్నాయి. పాఠశాల భవనం ఖాలీగా ఉండటంతో విద్యార్థులు అక్కడే ఆడుకుంటున్నారు.దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు శిథిలావస్త దశలో ఉన్నపాఠశాల భవనం కూలితే మా పిల్లల భవితవ్యం ఏమిటని ఆదోళన చెందుతున్నారు.తమ పిల్లలకు జరగరానిది ఏమైనా జరిగితే బాధ్యత ఎవరదంటూ స్థానిక ప్రజా ప్రతినిధు లను విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీస్తున్నారు.మారు మూల ప్రాంతం కావడంతో మాగ్రామం వైపు అధికారులుకాని,ప్రజాప్రతినిధులు కాని అటువైపు చూడరంటూ మండిపడుతున్నారు.అందునా ఈ పాఠశాల భవనం ఎస్సీ కాలనీలో ఉండటం విశేషం.ఇలా శిథిలావస్తదశలో ఉన్న పాఠశాల భవనాలను కూల్చివేయాలి. వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించేందుకు మండల విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.ఇదే విషయాన్ని ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు,అధికారులు సమక్షంలో ఆ గ్రామ సర్పంచ్ లేవనెత్తారు.మా గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాల భవనం శిథిలావస్తలో ఉంది,ఎప్పుడు నేలమట్టం అవుతుందో తెలియదు.ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని గ్రామస్తులు భయ పడుతున్నారు అని మండల పరిషత్ అభివృద్ధి అధికారివారికి వివరించారు.ఇంతకీ ఎక్కడా ఆ పాఠశాల భవనం తెలుసుకోవానుకుంటున్నారా? కాకినాడ జిల్లా కాజలురు మండల కేంద్రానికి శివారు ప్రాంతమైన పాతమంజేరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎలిమెంటరీ పాఠశాల ఉంది.ప్రమాదం పొంచివుంది మహెూ ప్రభో ..ఆ భవనాన్ని కూల్చివేయండి అని ఆ గ్రామ సర్పంచ్ గుంటూరి అప్పారావు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా మీడియా ద్వారా తెలిస్తే అధికారులలో కదలికవస్తాదేమోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అలాగే మండలంలో మరి కొన్ని పాఠశాలలు శిథిలావస్తులో ఉన్నాయి.కొన్ని చోట్ల ఆ భవనాలు పశు వుల శాలలకు ఉపయోపగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పిల్లల ప్రాణాలు కాపాడేందుకు ముందుకు రావాలని కోరుతున్నారు.చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ప్రయోజనం ఉండదని మంజేరు గ్రామ సర్పంచ్ గుంటూరి అప్పారావు తపన.

## అక్రమ రవాణా కు అడ్డ ఈ పడవ ప్రయాణం




**కుక్కునూరు,పెన్ పవర్,మార్చి 26:**పేరుకు చేపల వేట.చేసేది ప్రయాణికుల బాట.చేపల వేట మాటున నాటు పడవలపై ప్రయాణికులను నది దాటించి సొమ్ము చేసుకోవటం ఇక్కడ జరిగే వ్యాపారం. మండలంలోని వింజరం పంచాయతీ లోని గోదావరి నది ఒడ్డున అక్రమ పడవ రవాణా సాగుతుంది. అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ప్రయాణికులను దాటించటం ఇక్కడ పరిపాటిగా మారింది. పడవలో కనీసం లైఫ్ జాకెట్ చూడటానికి కూడా ఉండదు.ఇక ప్రజల ప్రాణాలు గాల్లో ఉంటూ నీటిపై ప్రయాణం చేస్తున్నారు.ఏదైనా ప్రమాదం జరిగితే ఒకే సారి అంత మంది బయట పడటం కష్టతరమే.ఒక మనిషికి యాభై రూపాయలు,బైక్ కు వంద రూపాయలు చొప్పున చార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికులను దాటవేస్తున్నారు.మరి ఇదంతా అధికారులకు తెలియదా అంటే పొరపాటే,ప్రయాణికుల మాటున అక్రమ రవాణాకు కూడా తెరలేపుతున్నారు.ఈ పడవను మైనర్ పిల్లలు ఆపరేట్ చేయటం,వాళ్లే ప్రయాణికులను నది దాటించటం ఆశ్చర్యానికి గురి చేస్తుంది.ఈ మధ్య పెద్ద ఎత్తున వింజరం రేవు నుంచి గంజాయి దాటించటం దాన్ని తెలంగాణ పోలీసులు పట్టుకోవటంతో పెద్ద మచ్చగా మారింది.వింజరం నది దాటి గంజాయి రవాణా జరిగిందంటే అక్రమ రవాణా ఏవిధంగా ఉందనేది తెలుస్తుంది. అనుమతులు లేకుండా ప్రయాణికులను దాటించటమే పొరపాటు.దానికి తోడు అక్రమ రవాణాకు తెరలేపి స్థానిక అధికారులకు తలనొప్పిగా మారింది వింజరం రేవు.అధికారులు స్పందించి అక్రమ పడవ ప్రయాణం నిలుపుదల చేస్తారా చేయరా అనేది చూడాలి.

# నెలలోపే పంట నష్టం అందిస్తాం

ప్రజా పరిష్కార వేదికలో ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మార్చి 26:**ఎర్రకాల వరదలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం నెలలోపే అందించే ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఆరుళ్లలో బుధవారం ప్రజా పరిష్కార వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించిన ప్రజలకు సేవ చేసే బాధ్యత తమపై ఉందని అందులో భాగంగానే గ్రామాల్లో తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం రోడ్లు డ్రైన్లు గ్రావెల్ రోడ్లు నిర్మాణాలకు అధికారులతో ప్రణాళిక రూపొందించామనారు. గ్రామంలో మంచినీటికి ఇబ్బంది ఉందని నిధులు కావాలని సర్పంచ్ కోరగా జలజీవన్ మిషన్ ద్వారా ఆ సమస్య పరిష్కరిస్తామ న్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్ తో బాధపడుతున్న సిర్రా ప్రసాదు, చదలవాడ మహాలక్ష్మి లకు ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకరాజు వరలక్ష్మి, మండల జనసేన అధ్యక్షుడు అడపా ప్రసాద్, మండల నాయకులు మైలవరపు రాజేంద్రప్రసాద్, పాలూరు వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు గూడవల్లి నాగేశ్వరరావు, బెజవాడ శ్రీను, చిటకన శ్రీను, మాన్యం రామదాస్, నాయకులు మాకరాజు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.59.70 కోట్లతో ఆర్వోబీ పరిపాలన అనుమతులు

కలెక్టర్ షన్మోహన్ ప్రకటన



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 26 :**పిఠాపురంలో రూ.59.70 కోట్లతో ఆర్వోబీ పరిపాలన అనుమతులు ప్రభుత్వం మంజూరు చేసిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని సామర్లకోట-ఉప్పాడ రోడ్డులో రైల్వే క్రాసింగ్ వద్ద వంతెన (ఆర్వోబీ) నిర్మాణానికి రూ.59.70 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ తెలిపారు.పిఠాపురంలో ఈ ఆర్వోబీ నిర్మాణానికి గత ఎన్నికల సమయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని, అందులో భాగంగా మంగళవారం పరిపాలన అనుమతి ఇస్తూ జి ఓ జారిచేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు. తొలుత వంతెన నిర్మాణ వ్యయం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని అనంతరం దాన్ని కేంద్ర రహదారి మౌలికవసతుల నిధి (సీఆర్ఎఫ్) కింద కేంద్ర ప్రభుత్వం రీయింబర్స్మెంట్ చేస్తుందని ఆయన తెలిపారు.



## తెలంగాణ మంత్రిని కలిసిన జనసేన నేతలు

**గోపాలపురం,పెన్ పవర్ మార్చ్ 26**
తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనరసింహం ను గోపాలపురం నియోజకవర్గానికి చెందిన జనసేన నేతలు బుధవారం కలిశారు. నల్లజర్ల మండలానికి చెందిన రుద్ర శ్రీనివాస్,ఉన్నమట్ల రమేష్ లు మంత్రిని కలిసి తమ సమస్య విన్నవించారు.స్థానికంగా ఉన్న మహిళ కిడ్నీ వ్యాధితో బాధపడుతుందని ఆమెకు తగిన వైద్యాన్ని హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో చేయించవలసి ఉందన్నారు.అయితే అందుకు సంబంధించి ఆరోగ్యశ్రీ పథకం కింద ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లభించిందని హైదరాబాదులో చేయించడానికి తెలంగాణ ప్రభుత్వ అనుమతి కావాలని వారు మంత్రిని కోరినట్లు తెలిపారు.సమస్యపై వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి వైద్యం చేయించడానికి కావలసిన అనుమతులు ఇవ్వాలని సూచించారన్నారు.ఆ మహిళ వైద్యానికి సహకరించిన ఉభయ రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులు,అధికారులకు జనసేన నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

ఇద్దరు మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 26:** జగ్గంపేట మండలం జె.కొత్తూరులో బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం జె.కొత్తూరు గ్రామ శివారున ఎదురెదురుగా రెండు బైక్ లు ఢీకొనడంతో బైక్ పై ప్రయాణిస్తున్న వారు కింద పడిపోయారు. అయితే పక్కనే వెళ్తున లారీ వారి తలపై వెళ్లడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. ఆ మహిళను చికిత్స నిమిత్తం ఆటోలో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలియగానే జగ్గంపేట పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని మృతదే హాలను పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు. పోలీసు సిబ్బంది ట్రాఫిక్ క్లియర్ చేశారు. అయితే మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదం ఎలా జరిగిందో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.





## ట్రాలీని ఢీకొన్న ఐషర్ వ్యాన్




**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 26:** మండలంలోని రామవరం జాతీయరహదారిపై బుధవారం ప్రమాదం జరిగింది. రాజమండ్రి నుంచి వైజాగ్ వైపు వెళ్తున్న రోడ్డులో ట్రాలీ లారీని ఐషర్ వ్యాన్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐషర్ వ్యాన్ డ్రైవర్ కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ట్రాలీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఈ ప్రమాదంతో జాతీయరహదారిపై కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ..





- రంపచోడవరం ఎస్డిపిఓ సాయి ప్రశాంత్...

**దేవీపట్నం,పెన్ పవర్,మార్చ్26:**దేవీపట్నం మండలం మునినిగుంట గ్రామంలో ఉన్న దామనపల్లి ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని రంపచోడవరం ఎస్డిపిఓ సాయి ప్రశాంత్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న సరళిని పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో కల్పించిన మౌలిక సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు.వేసవి దృశ్య మంచినీటి సదుపాయం అందుబాటులో ఉండాలని, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు,అత్యవసరం అందులో అందుబాటులో ఉండాలని తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసుకు అవకాశం ఇవ్వకుండా పగడ్బందీగా నిర్వహించాలని అన్నారు. సెట్టింగ్స్ స్క్వాడ్,ఫ్లయింగ్ స్క్వాడ్ తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు,వాచీలు,కాలిక్యులేటర్లు,అనుమతించొద్దని తెలిపారు.పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు,సిబ్బందిని నిశిత పరిశీలన అనంతరమే అనుమతించాలని తెలిపారు. పరీక్ష పత్రాలు,జవాబు పత్రాలు,రవాణా పోలీస్ ఎస్కార్ట్ తో చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవీపట్నం ఎస్సై షరీఫ్,ఎంఈఓ శిరసం బాలు దొర తదితరులు పాల్గొన్నారు.

## ఫాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్రవిచారణ జరపాలి: బ్రదర్ గుత్తుల సాల్మన్ దొర



**పెనుమంట్ర, పెన్ పవర్, మార్చి 26:** తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం కొంతమూరు, దివాన్ చెరువు వెళ్ళే ఫోర్త్ బ్రిడ్జి పెట్రోల్ బంక్ సమీపంలో విగత జీవిగా వెలుగు చూసిన క్రైస్తవ ఆరాధకులు, ప్రముఖ క్రైస్తవ ఆధ్యాత్మిక ప్రసంగికులు ప్రగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని బ్రదర్ గుత్తుల సాల్మన్ దొర, క్రైస్తవ సంక్షేమ సంఘం ఒక ప్రకటనలో కోరింది. ఈ ఘటనపై క్రైస్తవులకు, అభిమానులకు, ప్రజల్లో అనేక అనుమానాలున్నాయన్నారు. సత్య క్రైస్తవ ప్రచార కారణంతో మృతికి కారణం అయ్యారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు.హిందూ,ముస్లిం,క్రైస్తవ,సిక్కు,బౌద్ధ మున్నగు సర్వమత వర్ణ వర్గ ప్రజలతో మమేకమై నిలిచిన స్వచ్ఛ భారత దేశంలో కుల,మత పరమైన దూషణలు, దాడులు,హత్యలు రాజ్యాంగ ప్రగతికి దోహదం కావని ఆవేదన వ్యక్తం చేశారు.

## నమ్మించి మోసం చేశాడంటూ మహిళ ఆవేదన.




**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 26:**నమ్మించి మోసం చేశాడంటూ మహిళ బుధవారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం జరిగేలా చూడాలని సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీని ఆశ్రయించగా, అన్యాయ జరిగిన మహిళకు అండగా ఉండడమే తమ పార్టీ సిద్ధాంతమని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొసిరెడ్డి గణేష్ అన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకురాలు గండేటి నాగమణి, కొసిరెడ్డి గణేష్, బాధిత మహిళ వెంకట్ లక్ష్మి లు స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలేశ్వరం యర్రవరం గ్రామానికి చెందిన గురిమెరికల వీర వెంకటలక్ష్మి ఏలేశ్వరం పట్టణానికి చెందిన కోన శ్రీనివాస్ తో గత కొన్ని సంవత్సరాలుగా కలిసి ఉంటున్నామని,నన్ను వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని వెంకటలక్ష్మి ఆవేదన చెందింది.తమ కుటుంబ సభ్యుల శుభకార్యాలకు పలు అవసరాలకు నా తాలూకా సొమ్మును తీసుకుని ఇప్పుడు నేనెవరో తెలియదు అంటూ తిరుగుతున్నాడని కన్నీరు పెట్టుకుంది.సుమారు 8 లక్షల వరకు నా వద్ద నుంచి తీసుకొన్నారని, అదేగాక కొంత బంగారం వెండి కూడా అతని వద్ద ఉందని బాధితురాలు మీడియా ముఖంగా తెలిపింది. నేను ఒంటరిదాన్ని అందుకనే సిపిఐ ఎంఎల్ సిపిఐఎంఎల్ వినోద్ మిశ్రా మహిళా సంఘాల్ని ఆశ్రయించానని పేర్కొంది.ఆమెకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ,బాధిత మహిళకు న్యాయం జరగని ఎడల ఉద్యమం తీవ్రతరం చేస్తామని మీడియా సమావేశంలో ప్రకటించారు.

## అభాగ్యుల జీవితాల్లో కాంతిరేఖ సీఎం సహాయనిధి-ఎమ్మెల్యే కొండబాబు




**కాకినాడ.పెన్ పవర్ మార్చి 26 :**అభాగ్యుల జీవితాల్లో కాంతిరేఖలా సీఎం సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని కాకినాడ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు గారి సారథ్యంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద ప్రజలకు మేలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, మన ముఖ్యమంత్రి చంద్రన్న అడిగిన వెంటనే అపన్న హస్తం అందేలా చర్యలు తీసుకుంటున్నారని, వైద్య ఖర్చులు భారమై ఆర్థిక స్థోమత లేని అనేకమంది పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో భరోసానిస్తుందని తెలిపారు. కాకినాడ నియోజకవర్గానికి సంబంధించి 8 మంది లబ్ధిదారులకు 6 లక్షల 15 వేల రూపాయలు అందించారని, పేద ప్రజలకు నేనున్నానంటూ చేయూత అందించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వ నేతృత్వంలో రాష్ట్రంలోకి దేశ, విదేశీ పెట్టుబడులు వస్తున్నాయని, లక్షలాదిమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అరదాడి శివ, పిర్ల లక్ష్మీ ప్రసన్న, గురుసు దుర్గారావు, సంఘాని నాగూర్, పిన్నంరెడ్డి బుజ్జి, పట్టా శేఖర్, తిప్పాని విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్త ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

సిడిపిఓ లక్ష్మి

**గంగవరం,పెన్ పవర్,మార్చ్26:**గంగవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోగల అంగన్వాడి కార్యకర్త,, అంగన్వాడి సహాయకురాలు ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సిడిపిఓ లక్ష్మి తెలిపారు. మండలంలోని పెద్ద అడ్డపల్లి అంగనవాడి కార్యకర్త, గంగవరం 2 ,కుసుమరాయి అంగన్వాడి కేంద్రాల్లో సహాయకురాల పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని అన్నారు.ఈనెల 26వ తేదీ నుండి ఏప్రియల్10 తేదీ సాయంత్రం 5గంటల వరకు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అర్హత కలిగిన వారు దరఖాస్తులు అందించాలని సిడిపిఓ తెలిపారు. కనీస విద్యార్హత పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండి ఈ ఏడాది జులై ఒకటి నాటికి 21 సంవత్సరం వయసు నిండి 35 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు.ఎస్టీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, స్థానిక స్థిర నివాసం కలిగిన వివాహిత స్త్రీ అయి ఉండి, దరఖాస్తు నందు నిర్వహించబడిన ప్రదేశంలో నివాసం ఉంటున్నట్లు మండల రెవెన్యూ అధికారి చే నివాస ధ్రువీకరణ పొందాలన్నారు. విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్స్ ఆధార్ కార్డు, కుల ధృవపత్రం, రేషన్ కార్డు,అన్ని జిరాక్స్ కాపీలు, గెజిటెడ్ ఆఫీసర్ చే అటస్టేడ్ చేయించి ఒక జత,ఫోటో,5రూపాయల పోస్టల్ కవర్ ను, కార్యాలయముకు సమర్పించాలన్నారు.మరింత సమాచారం కొరకు గంగవరం ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## కాకినాడ నగరంలో సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం ఆధ్వర్యంలో అదనపు కమిషనర్ కు వినతి



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 26:** కాకినాడ నగరంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఉదయం నగర పాలక సంస్థ కమిషనర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి అనంతరం అదనపు కమిషనర్ సుధాకర్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలలో భాగంగా కాకినాడ నగరంలో మార్చి 11 నుండి 20 వరకు వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలుసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలు సిపిఎం దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను అధికారులకు తెలియచేయడం జరుగుతుందన్నారు. పెన్షనర్స్ ప్యారడైజ్ గా పేరుగాంచిన కాకినాడ దోమల నిలయంగా మారిపోతుందన్నారు. చెత్త సేకరణ కు ఇచ్చిన ప్రాధాన్యత డ్రైన్ క్లీనింగ్ కి లేకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నట్లు చెప్పారన్నారు. నగరంలో సామాన్యుల సొంతింటి కల నెరవేర్చాలని, టిడ్కో గృహాలు నిర్మాణం పూర్తి చేయాలని, స్థలం ఉన్నవారికి హౌసింగ్ లోన్ మంజూరు చేయాలన్నారు. నగరంలో వేసవిలో త్రాగునీటి కొరత లేకుండా చూడాలని, శివారు ప్రాంతాల్లో పరిశుభ్రమైన నీరు అందించాలన్నారు. నగరంలో అవసరమైనచోట మున్సిపల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని, సిసి కేమెరా లు ఏర్పాటు చేయాలని, జిజిహెచ్ పడకల స్థాయి పెంచాలన్నారు. జగన్నాధపురం ఉప్పుటేరు పై 3 వ వంతెన నిర్మించాలని, నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలన్నారు. నగర పాలక సంస్థ అధికారులు సాయంత్రం వేళల్లో పేటల్లో పర్యటించాలని కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు కాకినాడ నగర పాలక సంస్థ కు ఎన్నికలు నిర్వహించి ప్రజా పాలన కొనసాగించాలన్నారు.

సిపిఎం దృష్టికి వచ్చిన వివిధ ప్రాంతాల సమస్యలను రాతపూర్వకంగా అదనపు కమిషనర్ కు సమర్పించగా సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మలక వెంకట, నాగాబత్తుల సూర్యనారాయణ, ప్రసాద్ లతో పాటు మేడిశెట్టి వెంకటరమణ, చంద్రమళ్ళ పద్మ, వెంకట్రావు, కె. సత్తిబాబు, భూలక్ష్మి, భారతి, సత్యానందం, సుధాకర్, సత్యనారాయణ, సురేష్, విజయ్,వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి సిటిజన్ సహకారం



**గంగవరం, పెన్ పవర్, మార్చ్ 26:**మండలంలోని రాజవరంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తుంపల పరుశురాం కుటుంబానికి సిటిజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ నిడమర్తి చిన్నబాబు కార్యదర్శి సుజాత సూరంపాలెం సర్పంచ్ బల్లెం శివ దొర సహకారం అందజేశారు. కుటుంబానికి రెండు వేల రూపాయల నగదు 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ చిన్న బాబు మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం అగ్నిప్రమాదం సర్వం కోల్పోయిన దళిత కుటుంబాలు సరైన నివాసం లేక తీవ్ర ఇబ్బందులతో జీవిస్తున్నారన్నారు. అటువంటి కుటుంబంలో ఒక వ్యక్తి చనిపోవడం ఆ కుటుంబానికి తీరని లోటు అని ఆయన అన్నారు. బాధిత కుటుంబా న్ని దాతృత్వం కలిగిన వ్యక్తులు గాని సంస్థలు ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

## ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష

**గోకవరం, పెన్ పవర్, మార్చి 26 :** బుధవారం ఎంపీడీవో ఏ గోవింద్ ఆధ్వర్యంలో ఏపీఓ ఎస్ అప్పలరాజు అధ్యక్షతన ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు.ఉపాధి హామీ పంచ ప్రాధాన్యాలైన పశు నీటి తొట్టెల నిర్మాణం, ఫాం పాండ్ ల నిర్మాణం పంట కాలువలలో పూడికతీత,సాగునీటి చెరువులలో పూడికతీత, ఉపాధి పనివారి సగటు వేతనం 290 రూపాయలు వచ్చే విధంగా చూడటం వంటి అంశాలపై సాంకేతిక సహాయకులు క్షేత్రస్థాయి సహాయకులకు ఏపీఓ అప్పలరాజు తగు సూచనలు చేశారు. 'ఉన్నతి'కార్యక్రమంలో భాగంగా వంద రోజులు పూర్తి చేసుకున్న ఉపాధిపనివారి కుటుంబాలలో అర్హత కలిగిన యువతకు నైపుణ్యత కలిగిన నర్సింగ్ ,మెకానికల్ ,సిఎల్సి ఆపరేటింగ్, కంప్యూటర్ బేసిక్స్ వంటి వాటిలో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తారని శిక్షణ సమయంలో ఉచిత భోజనం వసతి సదుపాయం ప్రభుత్వం భరిస్తుందని ఏపీవో తెలిపారు. రానున్న వేసవిలో ఉపాధి పనులుచేయు పనిప్రదేశాల వద్ద నీరు, నీడ ఏర్పాటు చేయడం, ఏఎన్ఎం ద్వారా ప్రథమ చికిత్సకు అవసరమైన కిట్లను సమకూర్చుకోవాల్సిందిగా క్షేత్ర సహాయకులను ఏపీవో అప్పలరాజు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని క్షేత్ర సహాయకులు సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కార్యకర్త ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం.....

- రంపచోడవరం-దేవీపట్నం సిడిపిఓ సంధ్యారాణి...



**దేవీపట్నం,పెన్ పవర్,మార్చ్26:**ఐసిడిఎస్ ప్రాజెక్ట్ రంపచోడవరం పరిధిలోగల అంగన్వాడి కార్యకర్త,మినీ అంగన్వాడీ కార్యకర్త, అంగన్వాడి సహాయకురాలు ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రంపచోడవరం,దేవీపట్నం సిడిపిఓ సంధ్యారాణి పత్రికా ప్రకటనలో తెలిపారు.సిడిపిఓ సంధ్యారాణి మాట్లాడుతూ రంపచోడవరం మండలంలోని ఎం బూరుగుబందా మినీ అంగన్వాడీ కార్యకర్త,ఇసకపట్ల,రంప సహాయకురాలు,దేవీపట్నం మండలంలోని దేవారం అంగన్వాడీ కార్యకర్త,దండంగి,తొయ్యేరు-1, సి.హెచ్ భీంపల్లి సహాయకురాల పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని అన్నారు.ఈనెల 26వ తేదీ నుండి ఏప్రియల్10 తేదీ సాయంత్రం 5గంటల వరకు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ రంపచోడవరం కార్యాలయంలో అర్హత కలిగిన వారు దరఖాస్తులు అందించాలని సిడిపిఓ తెలిపారు. కనీస విద్యార్హత పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండి 01-07-2025 తేదీ నాటికి 21 సంవత్సరం వయసు నిండి 35 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు.ఎస్టీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, స్థానిక స్థిర నివాసం కలిగిన వివాహిత స్త్రీ అయి ఉండి, దరఖాస్తు నందు నిర్వహించబడిన ప్రదేశంలో మండల రెవెన్యూ అధికారి చే నివాస ధ్రువీకరణ పొందాలన్నారు. విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్స్ ఆధార్ కార్డు, కుల ధృవపత్రం, రేషన్ కార్డు,అన్ని జిరాక్స్ కాపీలు, గెజిటెడ్ ఆఫీసర్ వారిచే అటస్టేడ్ చేయించి ఒక జత,ఫోటో,5రూపాయల పోస్టల్ కవర్ ను, కార్యాలయముకు సమర్పించాలన్నారు.మరింత సమాచారం కొరకు రంపచోడవరం ఐసిడిఎస్ కార్యాలయమునకు వచ్చి సంప్రదించవచ్చునని సిడిపిఓ సంధ్యారాణి అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

ఎమ్మెల్యే శిరీష దేవి





**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, మార్చి26:**ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యమని రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి అన్నారు. బుధవారం రంపచోడవరం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పలు ప్రాంతాల ప్రజలు వచ్చి వారి యొక్క సమస్యలను ఎమ్మెల్యే శిరీష కి వినతులు నేరుగా అందించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ ఇకనుంచి ప్రతి బుధవారం ప్రజా సమస్యలపై ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. నేటి ప్రజా దర్బార్ లో 41 వినతులు రాగా ప్రతి దరఖాస్తు ను పరిశీలించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపుతామని పేర్కొన్నారు. అదేవిధంగా ఇకనుంచి ప్రజా సమస్యలపై వచ్చే ప్రతి దరఖాస్తుదారులు వారి యొక్క దరఖాస్తుకీ వారి యొక్క ఆధార్ కార్డు జోడించి తీసుకుని రావాలని కోరారు. ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామస్తులు రోడ్డు సౌకర్యం, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, పట్టుచీర గ్రామంలో నూతన అంగన్వాడి భవన నిర్మాణం చేపట్టాలని, రంపచోడవరం మండలం దబ్బ వలస గ్రామస్తులు రేషన్ డిపోను మంజూరు చేయాలని, వి ఆర్ పురం గ్రామానికి చెందిన ముత్యాల లక్ష్మి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కావాలని, పెద్ద గెద్దాడ గ్రామస్తులు చెక్ డ్యాం నిర్మాణం ఇలా పలు సమస్యలపై వినతులను అందిచారన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, రంపచోడవరం మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, ఎటపాక టిడిపి మండలం అధ్యక్షులు పుట్టి రమేష్,మాజీ మండల అధ్యక్షులు అడబాల బాపిరాజు,వై నిరంజనీదేవి, బాపన్న దొర తదితరులు ఉన్నారు.

## శ్రీ సత్య దేవా టెంట్ హౌస్ వర్తక సంఘం నూతన కార్యవర్గం ఎంపిక.



**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 26:** శ్రీ సత్యదేవ టెంట్ హౌస్ వర్తక సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక కమ్యూనిటీ హాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారుల సంఘం సభ్యులు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా అప్పటి ప్రభుత్వ విధానాల కారణంగా అసంఘటిత కార్మిక రంగం కుదేలైంది అన్నారు. మన వర్తక సంఘం ఏలేశ్వరం మండల వ్యాప్తంగా అనేక కార్మిక సంఘాలకు చేదోడు వాదోడుగా ఉంటూ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. కరోనా భయంతో 2019 డిసెంబర్లో ప్రజలు ఇళ్లకే పరిమితమైతే మన సంఘం ఇంటింటికి వెళ్లి కరోనా మందులు ఇవ్వడంతో పాటు బియ్యం, నిత్య అవసర సరుకులు సొంత డబ్బులతో పంపిణీ చేయడం జరిగిందన్నారు. కొంతకాలమైతే భోజనాలు వండి ఇళ్లకు ఇచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. అయితే ఈరోజు జరిగిన కార్యవర్గం ఎన్నిక ప్రశాంతంగా జరగడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ఎన్నిక కాబడిన ప్రతి వ్యక్తిపై రాబోయే రోజుల్లో సంఘం తరపున చేయవలసిన కార్యక్రమాలు బాధ్యతాయుతంగా చేయాలని కోరారు.

నూతన కార్యవర్గ ప్రెసిడెంట్గా గూడవల్లి అర్జున్ రావు , వైస్ ప్రెసిడెంట్ గా కోన బాబు, సెక్రటరీగా గూడుపు కృష్ణ, జాయింట్ సెక్రటరీగా జి కృష్ణమోహన్, రెడ్డి ట్రెజరర్ గా బస్సా దుర్గాప్రసాద్ , ఇతర కార్యవర్గ సభలను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

## శిధిలమైన రైలింగ్ ఎదురు కర్రలే ఆదారం పొంచిఉన్న ప్రమాదం





**కొత్తపేట, పెన్ పవర్, మార్చి26:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం చెల్లిరేవు గ్రామంలో బొబ్బర్లంక అమలాపురం ప్రధాన పంట కాలవపై దేవరపల్లి గ్రామాన్ని చెల్లిరేవును కలిపే బండారు వారధి శిధిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వాలు మారినా సమస్యలు మాత్రం పడకేసే ఉన్నవి. గత కొన్ని రోజులుగా వంతెనకు రక్షణగా ఉన్న రైలింగ్ ,కాంక్రీటు స్థబాలు రోజురోజుకు పెచ్చులు ఊడిపోయి,బలహీనపడి కొన్ని స్థబాలు,రక్షణ గోడలు ఇరిగిపోయినవి.ఆ స్థానంలో రక్షణగా ఎదురు కర్రలతో తాత్కాలిక ఏర్పాటు చేసినారు, ఈ సందర్భంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే పరిస్థితులు ఏర్పడినప్పుడు అత్యంత ప్రమాదకరంగా ఉంటుందని, కంగారుపడి అదుపు తప్పితే కాలువలో పడి పోయే ప్రమాదం ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈప్రాంతానికే చెందిన వ్యక్తే గ్రామ సర్పంచ్ అయినా కనీసం ఈ సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రోజుకి వందల మంది ప్రయానికులు,స్కూల్ పిల్లలు ,పిల్లలు ను తీసుకుని వెళ్లే ఆటోలు,ఈ వంతెన పైనే ప్రయాణం కొనాసాగిస్తున్నారు. పట్టపగలే ప్రయాణం చేయటానికి కంగారు పడుతున్న ప్రయాణికులు, రాత్రివేళలో మరింత భయందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యకు పరిష్కారం చేయవలసినదిగా భవిష్యత్తులో జరగబోయే ప్రమాదాలను నివారించవలసిందిగా స్థానికులు అధికారులను కోరుకుంటున్నారు.

## ఆక్వా జోన్ గ్రామ సభ



**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 26:**ఆక్వా జోన్ గ్రామ సభలు పతి గ్రామంలో నిర్వహించాలని ఆక్వా పంటలపై ప్రతి ఒక్క రైతు దృష్టి పెట్టాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో బుధవారం

వెలిచేరు గ్రామంలో ఆక్వా జోన్ గ్రామ సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆత్రేయపురం, రెవెన్యూ సిబ్బంది ,ఆత్రేయపురం ఎఫ్ డి ఓ , ఐ సి ఏ , వి ఎఫ్ ఎ అధికారులు పాల్గొన్నారు. గ్రామ సభలో ఆక్వా జోన్ సంబంధిత సమస్యలను పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకొనబడునని తెలియజేసియున్నారు . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు హరిబాబు, ఎంపీటీసీ మట్ట లక్ష్మీ బుజ్జి ,నాయకులు రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కార్యకర్తే అధినేత ...తెలుగుదేశం పార్టీ నినాదం

### కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గంలో ప్రతి బుధవారం సమావేశం : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.





**రావులపాలెం పెన్ పవర్ మార్చి 26**:కార్యకర్తే అధినేత అనేది తెలుగుదేశం పార్టీ నినాదం అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.బుధ వారం రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఆకుల రామకృష్ణ,కేవీ సత్యనారాయణ రెడ్డి లతో కలిసి పార్టీ కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఇచ్చిన మాట మేరకు కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని ఆచరణలో పెట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఇందులో భాగంగానే ప్రతి బుధవారం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

కార్యకర్తే అధినేత అనే మాటలను తెలుగుదేశం పార్టీ ఆచరణలో పెడుతోందని ఇకపై ప్రతి కార్యకర్తను కలిసి సమస్యలు పరిష్కరించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సంచలన నిర్ణయం తీసుకున్నారన్నారు.పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలమని దేశంలో ఏ పార్టీకి లేని సంస్థాగత నిర్మాణం తెలుగుదేశానికి ఉందని అన్నారు.ఇటీవల కోటి సభ్యత్వాలతో చరిత్ర సృష్టించి అతిపెద్ద కుటుంబంగా మారిన నేపథ్యంలో కార్యకర్తే అధినేత అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు .ఈ మేరకు అన్ని నియోజకవర్గాల్లో ప్రతి బుధవారం ఎమ్మెల్యేలు, ఇన్ ఛార్జ్ లు కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారికి అండగా నిలుస్తామని సమస్యలు పరిష్కరించాలని పార్టీ నాయకులు, శ్రేణులకు ఆదేశాలు జారీ చేశారని వివరించారు.క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జ్ లతో పాటు బాబు ష్యూరిటీ–భవిష్యత్ కు గ్యారెంటీ ఫీల్డ్ వర్క్, శంఖారావం ఫీల్డ్ వర్క్, ఓటర్ వెరిఫికేషన్, పార్టీ యాప్స్, సభ్యత్వ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలను మరోసారి అభినందించారు.పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం అన్ని నియోజకవర్గాల్లో ఇన్చార్జ్లు, ఎమ్మెల్యేలు ప్రతి బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి ప్రజాదర్బార్ లో వినతులు స్వీకరిస్తామని తెలిపారు.మధ్యాహ్నం నుంచి నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.ప్రతీ కార్యకర్తను అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన పెంచాలి.





**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 26**: ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు మొగ్గు చూపే విధంగా వ్యవసాయ, ఆయా అనుబంధ శాఖల అధికారులు రైతులకు అవగాహన పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారిని జోకా అమృత అన్నారు. బుధవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో 2025 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, సార్వత్రిక సూత్రాలపై మండల వ్యవసాయ, అనుబంధ శాఖల మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోకా అమృత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లే కార్యక్రమంలో భాగంగా రైతులందరూ రసాయన ఎరువులు, పురుగు మందులకు బదులుగా, గో ఆధారిత ఎరువులు, బీజామృతం,జీవామృతం, పంచగవ్య, వృక్ష సంబంధిత కషాయాలు నీమాస్త్రం,అగ్ని అస్త్రం, ఉపయోగించి నాణ్యమైన ఆరోగ్యవంతమైన పంటలు పండించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ సహాయకులు పి అప్పలనాయుడు మాట్లాడుతూ 365 రోజులు భూమిని పంటతో కప్పి ఉంచాలని, తేలికపాటి దమ్ములు, దమ్ము లేని సాగు, రైతులు సొంత విత్తనాలు, దేశవాళీ విత్తనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులను వ్యవసాయంలో అనుసంధానం చేయాలని ప్రకృతి వ్యవసాయంపై పలు సూత్రాలను విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ రామలక్ష్మి, వెలుగు ఏపీఎం, వేదకుమారి, యూనిట్ ఇన్చార్జులు శేషు బాబు, బచ్చల శ్రీను, మోడల్ మేకర్ గంగబాబు తదితరులు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల గురించి వివరించారు.


# టెండర్ ప్రకటన

ఇందు మూలంగా కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామపంచాయతీ యొక్క 2025-26 సంవత్సరంనకు ఈ దిగువ తెలుపబడిన అంశాలను పై సరఫరా నిమిత్తం టెండర్లు పిలువబడుతున్నావి. సదరు టెండర్లు ది 29-0 3-2025 వ తేదీన మధ్యాహ్నం 2.00 గంటలకు తెరువబడును. అందు తక్కువ టెండరు దారుకు యొక్క టెండర్లు కాయ పరచబడును. మిగిలిన వివరాలు గ్రామపంచాయతీ యందు అడిగి తెలుసుకోవలెను.

| Sno | వివరం | ధరావత్తు | టెండర్లు తెరువబడిన సమయం |
|---|---|---|---|
| 1 | పారిశుద్ధ సిబ్బంది నియామకం | 50 | 29.03.2025 మధ్యాహ్నం 2.00 గంటలకు |
| 2 | విద్యుత్ సామాగ్రి సప్లయ్ | 200 | 29.03.2025 మధ్యాహ్నం 2.00 గంటలకు |
| 3 | పారిశుద్ధ సామాగ్రి సప్లయ్ | 200 | 29.03.2025 మధ్యాహ్నం 2.00 గంటలకు |
| 4 | పుస్తకాలు ఫారములు సప్లయ్ | 50 | 29.03.2025 మధ్యాహ్నం 2.00 గంటలకు |
| 5 | ట్యాంక్ వాచర్ నియామకం | 50 | 29.03.2025 మధ్యాహ్నం 2.00 గంటలకు |
| 6 | ఇతరములు | 50 | 29.03.2025 మధ్యాహ్నం 2.00 గంటలకు |

తేదీ :26-03-2025

గ్రామ పంచాయతీ
గొల్లపాలెం,
కాజులూరు మండలం, కాకినాడ జిల్లా.


## డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

-గెద్దనాపల్లి బీసీ కాలనీని పరిశీలించిన జ్యోతుల నవీన్ కుమార్.



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 26:** కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి బీసీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు, డ్రైనేజీలతోపాటు,రోడ్డు లు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్,పంచాయతీరాజ్ శాఖ డి ఇ, ఉమాశంకర్ ను ఆదేశించారు. గెద్దనాపల్లి గ్రామంలో వర్షాలు,వరదలు వస్తున్న సమయంలో బీసీ కాలనీ తరచూ ముంపుకు గురి అవుతుంది. దీంతో సమస్యను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ లకు స్థానిక నాయకులు సమస్యను వారు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జ్యోతుల నవీన్ కుమార్ , పంచాయతీరాజ్ శాఖ డి ఇ,ఉమాశంకర్, పార్టీ నాయకులతో కలిసి బుధవారం బీసీ కాలనీ పరిశీలించారు. ఈ సందర్భంగా హైస్కూల్ రోడ్డు నుండి బీసీ కాలనీ వరకు మురుగుపారేందుకు డ్రైనేజీలతోపాటు, రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆయన వెంట ఎంపీపీ తోట రవి,తోట గాంధీ, భూపాలపట్నం గ్రామ సర్పంచ్ వీరంరెడికాశీబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు చదరం చంటిబాబు, గెద్దనాపల్లి మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకట శివ,టీడీపీ నాయకులు తూము కుమార్ కాళ్ళవెంకటేష్ ఉన్నారు.

## సొంతింటి కల నెరవేర్చాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మార్చి 26:**కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతీ పేద కుటుంబానికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం,ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించి పేదల సొంతింటి కల నెరవేర్చాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. బుధవారం సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య పట్టణ శాఖల ఆధ్వర్యంలో 3 వ వార్డు కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఇళ్ళస్థలాలు అర్జీలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ పేదలు స్వంత గృహాలు లేక అద్దె ఇళ్ళకు అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. పేదలు అద్దె ఇళ్ళల్లో కాకుండా స్వంత ఇళ్ళలో వుండే పరిస్థితి కల్పిస్తే ప్రతీ పేద కుటుంబానికి నెలకు ఐదు నుంచి ఆరు వేల రూపాయలు వరకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. తక్షణమే పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని భీమారావు కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. సీతారాం ప్రసాద్, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరావు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వద్దాది మేరీ, కెవిప్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మెరిపో జాన్ రాజు, నిమ్మకాయలు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ వ్యవసాయ ఆదర్శ రైతులకు సన్మానం.



**కిర్లంపూడి, పెన్ పవర్,మార్చి 26 :** మండల కేంద్రమైన కిర్లంపూడి వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండలంలోని పలువురు సేంద్రియ వ్యవసాయ ఆదర్శ రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారిని జోకా అమృత ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని గోనేడ గ్రామానికి చెందిన ఎంపీటీసీ, గ్రామ సేంద్రియ వ్యవసాయ ఆదర్శ రైతు అల్లు శివరామకృష్ణ, ముక్కొ ల్లు గ్రామానికి చెందిన సేంద్రీయ వ్యవసాయ ఆదర్శ రైతులు దేగల శ్రీనివాసరావు, కొండపల్లి శ్రీను, వీరవరం గ్రామానికి సేంద్రీయ వ్యవసాయ ఆదర్శ రైతు చెందిన వెలుగుల భాస్కరరావు లను జోకా అమృత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జోకా అమృత మాట్లాడుతూ మండలంలో రైతులందరూ సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించి నాణ్యమైన, ఆరోగ్యవంతమైన పంటలు పండించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## జగ్గంపేటలో చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 26:** జగ్గంపేట పోలీస్ స్టేషన్ పక్కన జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వై ఆర్ కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాటసారులకు ఎమ్మెల్యే నెహ్రూ మజ్జిగ పంపిణీ చేశారు. వేసవికాలంలో బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డిఎస్పీ శ్రీహరి రాజు, జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్, జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు, గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు, కిర్లంపూడి ఎస్సై సతీష్, పోలీసు సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## భూసార పరీక్ష ఫలితాలపై అవగాహన



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 26:** జగ్గంపేట గ్రామంలోని రైతు భరోసా కేంద్రం 2లో భూసార పరీక్ష ఫలితాలపై మరియు ఎరువుల వినియోగం గురించి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ హరి, డిఆర్సి ఏవో సంజీవ్ కుమార్ మరియు భూసార పరీక్ష కేంద్రం ఏవో పవిత్ర రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు భూసార పరీక్షలు అనంతరం ఫలితాలను ఆధారంగా చేసుకుని రైతులు తమ పొలంలో ఎంతెంత మోతాదులో ఎరువులు వేయాలో వాళ్లకి వివరంగా తెలియజేశారు. సమస్యాత్మక భూములు ఏమన్నా ఉన్నట్లయితే చౌడు భూములు ఆమ్ల భూములు రైతులకు అక్కడ చేపట్టవలసిన యాజమాన్యం గురించి తెలియజేశారు. రైతులు తప్పనిసరిగా తమ పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు వేయాలని తద్వారా, భూసారం పెరుగుతుందని తెలియజేశారు. ప్రస్తుత దినాల్లో భూసారం చాలా తక్కువగా ఉంది కాబట్టి రైతులందరూ భూమిని సారవంతంగా చేసుకోవాలని దానికి అనుగుణంగా మనకి దిగుబడి పెరుగుతుందని తెలియజేశారు. ప్రతి మూడు పంటలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని దమ్ములో తప్పనిసరిగా ముడి జింకు ను ఎకరాకు 20 కేజీలు ప్రతి మూడు పంటలకు ఒకసారి వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## సర్వేలు పూర్తి చేయాలి ఎంపిడిఓ



**అల్లవరం, పెన్ పవర్, మార్చ్ 26:**బుధవారం ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ బెండమూరులంక, తుమ్మల పల్లి,మొగళ్ళమూరు సచివాలయం లలో సిబ్బంది హాజరు పరిశీలించి వర్క్ ఫ్రం హెూం, నాన్ రెసిడెంట్ ఆంధ్రా సర్వేలు త్వరగా పూర్తి చేయాలని
హాజరు సమయానికి నమోదు చేయాలని ఆదేశించారు.
మధ్యాహ్నం ఎంపిడిఓ కార్యాలయం లో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు
ఈ సమావేశంలో బిసి,కాపు కార్పొరేషన్ లోన్ల ఇంటర్వ్యూ లు, నీటి ఎద్దడి, పారిశుధ్యం, జి పి డి పి, సెక్రటరీ లాగిన్ లో పి జి ఆర్ ఎస్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ నమోదు, విజన్ 2047 ,పంచాయతీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్, కార్యదర్శులు రాజ్ మోహన్, శ్రీనివాస్, సత్యనారయణ, సిబ్బంది పాల్గొన్నారు

# యువత మేలుకో - భవిష్యత్తు మలుచుకో





**రాజవొమ్మంగి పెన్ పవర్ మార్చ్ 26:** రాజవొమ్మంగి మండలంలోని నాటు సారా మద్యం మరియు డ్రగ్స్ ద్వారా యువత మేలుకో భవిష్యత్ మలుచుకో అనే కార్యక్రమం రాజవొమ్మంగి సచివాలయంలోని కొందరు ప్రజలకు అవగాహన కల్పించారు రంపచోడవరం ఎక్సేంజ్, సీఐ శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి ఆదేశాల మేరకు గ్రామాల్లో గ్రామ సభల ద్వారా నాటు సారావలన కలిగే దుష్పరిణామాలు గురించి వివరించి అవగాహన కల్పించారు అల్లూరి జిల్లా ఎక్సేంజ్ సూపర్డెంట్ సుధీర్ మద్యం డ్రగ్స్ నాటు సారా వంటి వాటిపై కలిగే వివరించారు రాజవొమ్మంగి తాసిల్దార్, ఎంపీపీ, స్థానిక ఎస్సై రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ సంఘమిత్ర విద్యార్థికి జవహార్ నవోదయకు ఎంపిక



**గోపాలపురం,పెన్ పవర్ మార్చ్ 26 :**నియోజకవర్గంలోని నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలో ఉన్న శ్రీ సంఘమిత్ర పాఠశాల విద్యార్థికి జవహార్ నవోదయ పాఠశాలలో ప్రవేశానికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు.ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్షలలో జనార్దన్ అనే విద్యార్థి అత్యంత ప్రతిభ కనబరిచి జాజులకుంట లో ఉన్న నవోదయ పాఠశాలలో చదవడానికి ఎంపికయ్యాడన్నారు.ప్రతి ఏట వరుసగా నవోదయాలో తమ పాఠశాల విద్యార్థులు ప్రవేశం పొందుతున్నారని శ్రీనివాసరావు తెలిపారు.విద్యార్థులను ఇంత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు.అలాగే ఉపాధ్యాయులు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు.

## శ్రీ స్వామివారిని దర్శించుకున్న దేవాదాయ కమిషనర్





రామచంద్ర మోహన్

**సింహాచలం, పెన్ పవర్, మార్చి 26 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలం బుధవారం ఆంధ్రప్రదేశ్, విజయవాడ, దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి కొమ్ముల సుబ్బారావు, ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు నాధ స్వర వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ముందుగా కప్పస్తంభం ఆలింగనం, బేడా మండపము ప్రదక్షిణ, అనంతరము స్వామివారి దర్శనము, తదుపరి అమ్మవారి దర్శనం తరువాత వేద పండితులచే వేద ఆశీర్వచనమిచ్చి ఆలయ కార్యనిర్వహణాధికారి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం కమిషనర్ ఏప్రిల్ 30న జరిగే చందనోత్సవం, సామాన్య భక్తులందరికీ సౌకర్యంతమైన స్వామివారి దర్శనం భాగ్యం కలిగించి, అసౌకర్య సంఘటనలను నివారించడానికి, సింహాచలం శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో చందనోత్సవం ఉత్సవాల నిర్వహణకు ప్రామాణిక నిర్వహణ విధానాన్ని ఆమోదించాలని, ప్రభుత్వాన్ని కోరుచూ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి)ని ప్రభుత్వంనికి నివేదించి, అందుకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ.. దేవాదాయ శాఖ మంత్రితో కూడిన మంత్రుల బృందం, రెవెన్యూ మంత్రి, హెూంమంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి, జిల్లా మంత్రితో ఈ కార్యక్రమాన్ని సజావుగా మరియు విజయవంతంగా నిర్వహించాలన్నారు. అంతేకాకుండా వ్యూహాత్మకమైన ఏర్పాట్లతో దర్శనమునకు టైం స్లాట్స్ క్యూ లైన్ ల మెయింటినెన్స్ ఎక్కడ ఏ ఏ ఏర్పాట్లు చేయాలనే అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో ఒక సింగిల్ టీమ్ గా ఏర్పడి, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి మెరుగైన సౌకర్యాలతో సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. దేవాదాయ, రెవెన్యూ, హెూంశాఖ మంత్రి సమన్వయంతో చందనోత్సవాన్ని జయప్రదం చేయడానికి ఏప్రిల్ మొదటి వారంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, మంత్రి ఇచ్చే సూచనలు కూడా పరిగణనలను తీసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వారి ఆదేశాల ప్రకారము ఉత్సవాన్ని జయప్రదం చేసే విధంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ని
అమలు చేస్తామని తెలియజేశారు. వీరితో ఆలయ ఈవో కె.సుబ్బారావు, ఆలయ ఏఈఓ ఆనంద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు రాంబాబు, డిఈ హరి, సూరిబాబు తదితరులు ఉన్నారు.

## అరకు కాఫీ స్టాల్స్ లో గిరిజన మంత్రికి ఆహ్వానం అందకపోవడంతో గిరిజన మంత్రి ఎంపీ తనుజరాణి ఆగ్రహం



**అనంతగిరి పెన్ పవర్ మార్చి 26.** గిరిజన మంత్రికి అవమానం ఆంధ్రప్రదేశ్ లో ఏకైక గిరిజన పార్లమెంట్ నియోజకవర్గం అరకు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. నా నియోజకవర్గంలో జరిగే ఏ అధికారిక కార్యక్రమమైనా నాకు తెలియాలి. నాకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, ఆహ్వానించకుండా, గిరిజన సంక్షేమశాఖ వ్యవహరించడం అవమానకరంగా భావిస్తున్నాను అంటు అరకు పార్లమెంట్ ఎంపీ గుమ్మా తనుజారాణి ఆవేధన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె అనంతగిరి పెన్ పవర్ రిపోర్టర్ తో చరవాణిలో మాట్లాడారు. ఎపి ప్రభుత్వం గిరిజన ప్రజాప్రతినిధుల పట్ల వివక్ష చూపిస్తుందని, ప్రజాస్వామ్యంలో ఇది మంచి విధానం కాదన్నారు. తూర్పుకనుమల్లో విస్తారంగా పండే అరకు ప్రాంతం ఆర్గానిక్ కాఫీ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందనీ. కాఫీతో పాటు మరికొన్ని, పంటలు, ఔషధాలు ఉన్న ప్రాముఖ్యమైన ప్రాంతానికి తాను ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నాను. ఇది ఎపి ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. గిరిజన ఎంపీ నైనా తనపట్ల గిరిజన సంక్షేమ శాఖే వివక్ష చూపడం తో ఆవేధన కలిగిస్తుందన్నారు. పార్లమెంట్ ప్రాంగణంలో అరకుకాఫీ స్టాల్ ఆవిష్కరణకు తనను ఎందుకు ఆహ్వానించలేదని, సమాచారం ఇవ్వలేదని ఆమే ప్రశ్నించారు. ఏ.పి. గిరిజన సంక్షేమం శాఖ తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తపరిచారు. గిరిజన ఎంపీ పట్ల చూపుతున్న వివక్షపై స్పీకర్ దృష్టికి తీసుకు వెళతానని, ప్రధానికి లేఖ ద్వారా ఫిర్యాదు చేస్తానని, ఆమే తెలిపారు ప్రెస్ మీట్లో వైసిపి ఎంపీ లు బాబురావు. సుభాష్ చంద్రబోస్ తదితరులున్నట్లు ఆమే తెలిపారు.

## పలువురికి ముద్రగడ గిరిబాబు పరామర్శ



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 26:** ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ముద్రగడ గిరిబాబు కిర్లంపూడి మండలంలో పలు కుటుంబాలను పరామర్శించారు. మండల కేంద్రమైన కిర్లంపూడిలో స్వర్గీయ గొంప నూకరాజు సతీమణి, గొంప జోగి రాజమ్మ, మృతి చెందడమే కాకుండా, వారి కుమారుడు గొంప లక్ష్మీనారాయణ అదే సమయంలో గుండె సంబంధిత చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు వారి కుటుంబ సభ్యులు గొంప రామకృష్ణ తదితరులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కిర్లంపూడి గ్రామంలో ఇటీవల కుర్ల బుల్లిరాజు భార్య పద్మావతి మరణించారు. మండలంలోని ముక్కొలు గ్రామానికి చెందిన కౌలు రైతు అనపర్తి కృష్ణ పాము కాటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు ఆయా కుటుంబాలను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

## వేలంపాట ద్వారా రూ 10.57 లక్షల ఆదాయం



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 26 :** పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆశీల పాట ద్వారా పంచాయతీకి రూ.10.57 లక్షల సమకూరినట్లు పంచాయతీ కార్యదర్శి ఒగ్గు భార్గవ్ తెలిపారు. శృంగార వల్లభస్వామి దేవస్థానానికి వచ్చే వాహనాలకు పార్కింగ్ ఫీజు వసూలు నిమిత్తం రూ. 6,60,000 కు లక్కరాజు రామకృష్ణ, దుకాణాల నుంచి ఆశీలు వసూలుకు సంబంధించి రూ. 3,97,000 దంటు వీరబాబు దక్కించుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## సస్యరక్షణ చర్యలు పాటించాలి



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 26 :** మామిడి సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ఎన్. మల్లిఖార్జునరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చినబ్రహ్మదేవం గ్రామంలో మామిడి సాగులో సస్య రక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మామిడి తొందరగా కాపుకు రావటం, నాణ్యమైన ఉత్పత్తి, అధిక దిగుబడి రావాలంటే మొక్కలు నాటినప్పటి నుంచి వాటికి అందించే సమగ్ర సస్యరక్షణ చర్యలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. మొక్కకు కావలసిన పోషకాలను సేంద్రీయ ఎరువుల రూపంలో ఎక్కువగా వేసుకోవాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు రసాయన మందుల పిచికారీ తగ్గించి వీటికి బదులు పురుగులు, తెగుళ్ళు ఆశించకుండా ముందు జాగ్రత్తలు తీసుకొని జీవ సంబంధిత మందులు అయిన వేపనూనె, కానుగ నూనె, బవేరియా బాసియానా, మెటారైజియం వంటి సురక్షితమైనవి వాడుకొని నివారించుకోవాలన్నారు. స్థూల, సూక్ష్మపోషకాలను సేంద్రియ రూపంలో అందుబాటులో ఉన్నవాటిని ఉపయోగిస్తే ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ చిన్నబ్బాయి, మండల ఉద్యాన శాఖాధికారిణి నూనె సుజాత, అధిక సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటించండి

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 26:** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. బుధవారం జగ్గంపేటలో సీఐ వై ఆర్ కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ పాల్గొని మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్ పై ప్రయాణం చేయరాదని, రోడ్డు దాటేటప్పుడు తప్పనిసరిగా వాహనాలను చూచుకుని దాటాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ముఖ్యంగా హైవేపై వాహనాలు నిలుపుదల చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని, అతివేగంగా ప్రయాణం చేయవద్దన్నారు. మీ ప్రాణాలు కాపాడుకుని మీ కుటుంబంతో సంతోషంగా జీవించాలని ఎమ్మెల్యే నెహ్రూ పేర్కొన్నారు.

# అరకు పార్లమెంటు సభ్యురాలకు అవమానం



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 26:**-నియమ నిబంధనలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు ప్రజాస్వామ్య విలువలు ఇలా ప్రతి విషయంలోని దేశానికి దిశా నిర్దేశం చేసి పార్లమెంట్ లోనే ప్రోటోకాల్ ను పాటించకపోతే ప్రజాస్వామ్యం అపహాస్యమైనట్టు కాదా? అని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి ఆక్షేపించారు. పార్లమెంట్ ఆవరణంలో అరకుకాఫీస్టాల్ ప్రారంభోత్సవానికి అరకు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు సభ్యులు గుమ్మా తనుజారాణి ఆహ్వానించకపోవడంపై ఆమె తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. చింతపల్లిలో ఆమె క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. విలువలు పాటించాల్సిన పార్లమెంట్ లోనే వాటికి తిలోదకాలు ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. పార్లమెంట్ లో జరిగిన కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులకు అందులోనూ ఏ కార్యక్రమంఅయితేజరుగుతుందో ఆ కార్యక్రమానికి సంబంధించిన నియోజకవర్గ సభ్యులకు ఆహ్వానం ఇవ్వకపోవడంతో యావద్దేశం మొత్తం ఎన్ డి ఏ ప్రభుత్వ తీరునుతప్పుపడుతుందన్నారు. ఈ తరహా విధానాలే ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలోఎన్నికైనప్రజాప్రతినిధులకు ఏ మాదిరిగా గౌరవం ఇస్తుందో ఇదే స్పష్టమైన సంకేతం అన్నారు. అరకు పార్లమెంట్ సభ్యులు గుమ్మా తనుజారాణితెలియజేయకుండా పార్లమెంట్ ఆవరణంలో ఈ కార్యక్రమం చేయడమే పెద్ద పొరపాటు అన్నారు. దేశ స్థాయిలో ఉండే చోటే ఇలా అన్యాయం జరిగితే రాష్ట్ర, జిల్లా, గ్రామీణ స్థాయిలో ఆ ప్రజాప్రతినిధులకు ఏమాదిరిగా గౌరవం ఉంటుందో ఒకసారి అంతఆలోచించాలన్నారు. ఇది ఎన్డీఏ కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. పార్లమెంట్ఆవరణంలోఆమెకుజరిగినఅన్యాయమో వైసిపి నేతలపట్ల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరుగానో భావించకూడదని ఇది యావత్ గిరిజన జాతి పట్ల చులకన చూపునకు ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిదర్శనంఅనూష దేవి పేర్కొన్నారు. ఓట్ల రాజకీయం కోసమే గిరిజనులకు మేలు చేస్తున్నామని చెప్తున్నారే తప్ప అధికారం వచ్చిన తర్వాత వారి పట్ల ఎంత నిర్భీతిగా వ్యవహరిస్తున్నారో ఇటువంటి ఘటనలు సాక్ష్యం అన్నారు.

ఇకనైనా ఇటువంటి తప్పిదాలు జరగకుండా ఎండీఏ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలను ప్రతిపక్షాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు.

## జిల్లా ప్రజా సంకల్ప వేదిక కార్యవర్గం

- చింతపల్లి గ్రామం చెందిన
- ప్రధాన కార్యదర్శిగా నరసింహమూర్తి నియామకం "



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 26 :** విశాఖపట్నం వేదికగా ప్రజా సంకల్ప వేదిక సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం రంగసాయిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమాచారహక్కుచట్టం (ఆర్టిఐ)కు అనుబంధంగా పనిచేస్తున్న ప్రజా సంకల్ప వేదిక సొసైటీకి అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా చింతపల్లి మండల కేంద్రానికి చెందిన పంపాన నరసింహ మూర్తి నియమించబడ్డారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని పలువురు ప్రముఖ సామాజికకార్యకర్తలు, హక్కుల పరిరక్షణ సంఘాల ప్రతినిధులతో ఆయాజిల్లాలకు నూతన కార్యవర్గాన్ని నియమించారు. అందులో భాగంగా అల్లూరి జిల్లాకు ప్రధాన కార్యదర్శిగా మూర్తిని నియమించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సంకల్ప వేదిక సొసైటీ ఆధ్వర్యంలో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం పనిచేయడం ఆనందంగా ఉందని, ప్రజా సంక్షేమానికి తన తోటి సభ్యులతో కలిసి అంకితభావంతో పని చేయనున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతంలో ప్రజలు తమ హక్కులను పూర్తిగా ఉపయోగించుకోవాలంటే, సమాచార హక్కు చట్టంపై స్పష్టమైన అవగాహన అవసరమని, ప్రభుత్వ వ్యవహారాలపై ప్రశ్నించే హక్కును ఈ చట్టం కల్పిస్తుందన్నారు. కానీ, చాలామందికి ఈ చట్టం గురించి సరైన అవగాహన లేకపోవడంతో, వారు తమ హక్కులను వినియోగించు కోలేకపోతున్నారని, ఈ నేపథ్యంలో, ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, పౌర హక్కుల పరిరక్షణకు కృషి చేయడం, అవినీతి వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# మీరుంటే.. మాకేంటయ్యా!

అయ్యా.. హ్యాపీ బర్త్ డే..





**సంతబొమ్మాలి, పెన్ పవర్, మార్చి 26.** తీర ప్రాంతం.. ఆకలి దాహం.. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని,ఎదురు చూస్తున్న ప్రజలకు నేనున్నానని భరోసానిస్తూ, ముందుండి, అందరికీ ధైర్యాన్నిస్తూ నిలిచాడు. వాడే అచ్చెన్న.. వస్తాడు..చూస్తాడు! పరిష్కారం కనుగొంటాడు! తక్షణమే చేసి చూపిస్తాడు.. దటీజ్ అచ్చెన్న. అంటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవుడు ఎక్కడో ఉండడు. మన అచ్చన్నలా, మన వైపు ఒక కన్నేసి , అప్పుడప్పుడు పేదరికం నిర్మూలించడానికి ఆ సూర్యుడిలా, వెలుగునిస్తూ, చంద్రుడిలా ఉద్యమిస్తూ,మన బాగోగులు తెలుసుకొని, నేనున్నానని ధైర్యాన్నిస్తూ, ఈ నియోజకవర్గాన్ని తండ్రిలా కాపాడుకుంటూ, కష్టంలోనైనా, నష్టంలోనైనా మీ వెంటే ఉంటానని, అధైర్య పడవద్దని, ధైర్యాన్నిస్తూ,ముందుకు సాగుతున్నారు. అలాంటి నాయకుడు మా నియోజకవర్గంలో ఉండడం మా అదృష్టమని,ఆయనే మా ధైర్యం అంటూ, ఇలాంటి నాయకుడు తరతరాలు మాకు కావాలని, మళ్లీ మళ్లీ ఇలాంటి శుభదినాలు రావాలని, ఇలాంటి పుట్టినరోజులు, మరెన్నో జరుపుకోవాలని, మీరు మాతో మరియు మా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని, సంతబొమ్మాలి, నౌపడ పరిసర గ్రామస్తులు, నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు.

## తాజంగి కస్తూరిబాయి బాలికల విద్యాలయంలో దరఖాస్తుల ఆహ్వానం



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 26:-** చింతపల్లి మండలం తాజంగి గ్రామంలో ఉన్న కస్తూరిబాయి బాలికల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం గాను దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన ఉపాధ్యాయులు కె సుమ మాధురి తెలిపారు సీట్లు వివరాలు 6తరగతి 40 సీట్లు 7 తరగతిలో 1 9 తరగతి 1 ఇంటర్ మొదటి సంవత్సరం ఎంఈసి గ్రూపు 40 సీట్లు సీట్లు ఖాళీలు ఉన్నాయి ఈనెల 22 నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చును https://apkgbv.apcfss.in/హాస్టల్ వసతి కలదు సమస్యలపై పాఠశాల ఉపాధ్యాయురాలని సంప్రదించగలరు

## చింతలూరు నూకాంబికా జాతర ఉత్సవాలకు సేవా కమిటీ ఏర్పాటు



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 26:** చింతలూరు నూకంబిక జాతర ఉత్సవాలకు సేవా కమిటీని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడంతో జాతర ఉత్సవాలకు 19 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. ఈ కమిటీ ఈనెల 28 నుంచి ఏప్రిల్ 27 వరకు అమలులో ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సేవా కమిటీ సభ్యులుగా గన్ని వెంకట్రావు, వీరి శ్రీను, పెద్దింటి సూర్య ప్రభ, పసలపూడి నాగేశ్వరరావు, అప్పాడి శివన్నారాయణ, వంగివరపు నారాయణమ్మ, అత్తిలి వీరబాబు, సోమిరెడ్డి చిలకమ్మ, వాసా వేణుగోపాలకృష్ణ, పుదిరి వాసు, పలివెల శ్రీను, లేగా శ్రీనివాస్, నిడదవోలు సురేష్, మట్ట కాశీ, బొక్క రామకృష్ణ, అడ్డాల ఆదిత్య ప్రసన్నకుమార్, నూకపెయి చిన్న నాగరాజు, సంగాడి శ్రీను, పావులూరి అర్జున్ రావు లను నియమిస్తూ కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు ఉత్సవాల సేవా కమిటీ ఏర్పాటు చేయడంలో విశేష కృషి చేసిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ను గ్రామస్తులు అభినందించారు.

## నవోదయకి ఇద్దరు విద్యార్థులు ఎంపిక





**జీలుగుమిల్లి, పెన్ పవర్, మార్చి 26:** జవహర్ నవోదయ విద్యాలయ కి ఇద్దరు విద్యార్థులు ఎంపిక అయినట్లు ఎంఈఓ 2 ఎస్ బుచ్చయ్య తెలిపారు. బుధవారం ఎంఈఓ కార్యాలయంలో మాట్లాడుతూ నవోదయ ప్రవేశ పరీక్షలు 20 25 -26 విద్య సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు తెలిపారు. జీలుగుమిల్లి గ్రామానికి చెందిన పసుపులేటి లక్ష్మీ ప్రసన్న, మడకం వారి గూడెం గ్రామానికి చెందిన తెల్లం హర్షిత్ విద్యార్థులు ఎంపిక అయినట్లు తెలిపారు. వీరిని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పలువురు అభినందించారు.

## ముస్లిం సోదరులకు "వాసుపల్లి" రూ. 20,000 రంజాన్ తోఫా



**షాదిఖానా, దర్గాల అభివృద్ధి ఘనత వాసుప ల్లిదే**
**మోసపూరిత హామీలతో ముంచేసిన కూటమి ప్రభుత్వం**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 26 :** సొంత నిధులతో రంజాన్ తోఫా 20,000 నగదు ను మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గం వైఎ స్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కు మార్ ముస్లిం సోదరులకు అందజేశారు ఆశీల మెట్ట కార్యాలయంలో బుధవారం ఉదయం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆర్థిక సాయం అందజేశారు. రంజాన్ పవిత్ర దినము లలో భక్తిశ్రద్ధలతో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేస్తూ పండుగను నిర్వహిస్తారన్నారు. ముస్లిం సోదరులు అంటే చిన్నచూపు చూసే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బిజెపితో జతకట్టి సనాతన ధర్మం అంటూ వారికి ఇచ్చిన హామీ లను తుంగలో తొక్కారని విమర్శించారు.

దక్షిణ నియోజకవర్గంలో ముస్లిం సోదరులు అత్యధికంగా ఉన్న ప్రాంతమని, అలాగే అతి ప్రాచీన దర్గా కూడా ఉందన్నారు. దక్షిణ నియో జకవర్గంతో పాటు ముస్లిం సోదరులుతో తనది అత్యంత విడదీయరాని బంధం అన్నారు వారికి ఎప్పుడూ వైసిపి అండగా ఉంటుందని వాసు పల్లి తెలిపారు. వాసుపల్లి అందిస్తున్న సహాయ సహకారాలు పట్ల ముస్లిం సోదరులు కృతజ్ఞ తలు తెలిపారు.వైసిపి అధికారంలో ఉన్నప్పుడు హజ్ యాత్ర వెళ్ళేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. అలాగే షాదీ ఖానా అభివృద్ధికి వాసుపల్లి గణేష్ కుమార్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. మక్కా మసీదు అభివృద్ధితో పాటు తమ సమస్యల కోసం ప్రత్యేకంగా ప్రజా దర్బార్ నిర్వహించిన ఘనత వాసుపల్లి గణేష్ దేనన్నారులి. పేద ప్రజల కోసం ఎంతో ఆలోచించే వాసుపల్లి గణేష్ కుమార్ నిరంతరం ప్రజలతో ఉండే ప్రజా సేవకుడు అని కొనియాడారు. కానీ నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొ క్కిందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే అస లు జాడేలేదని, కేవలం సత్కారాలకు సన్మానా లకు తప్ప ప్రజల సమస్యలు పట్టని జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ దక్షిణం లో ఉండడం తమ దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లా ఆశీస్సులతో వైఎస్ఆర్సిపి మళ్లీ అధికారంలోకి రావాలని వారంతా ఆకాం క్షించారు. వాసుపల్లి గణేష్ కుమార్ అంటే తమ అందరికీ ప్రత్యేక అభిమానమని, ఆయన చేసు కున్న సేవలు ఆదర్శనీయమని ముస్లిం సోద రులు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ సఖిల్, 30 వ వార్డ్ ఇంచార్జ్ దస్మంతులు చిన్ని,33 వ వార్డ్ అధ్యక్షులు ముత్తాబత్తుల రమేష్, ఏరిన్న మ్మ తల్లి గుడి చైర్మన్ లండ రమణ, దూడ అప్పారావు, మహమ్మద్ నజీమ్, కాసిం, అనీష్, తాళహ, అస్రాఫ్, అజీజుల్లా, జమెల్, జాకీం, జాఫర్ అలీ, భాను , మహమ్మద్ మెహర్ఉల్లా, లైఎకాట్ తదితరులు పాల్గొన్నారు.

# వాణిజ్య సముదాయాల్లో అగ్ని మాపక పరికరాలు తప్పనిసరి. వి.ఎం.ఆర్.డి.ఎ

వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్



అగ్ని ప్రమా దాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసు కోవాలని





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం మార్చి 26 :** వి.ఎం.ఆర్.డి.ఎ.కి చెందిన దుకాణాల్లో , వాణి జ్య సముదాయాల్లో తప్పనిసరిగా అగ్ని మాపక పరికరాలు అమర్చాలని వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మ న్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. బుధవా రం ఉదయం సెంట్రల్ పార్క్ ఎదురుగా వి ఎం ఆర్ డి ఎ కి చెందిన షాప్ 14 లో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన గురించి తెలుసుకున్న చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్, వి ఎం ఆర్ డి ఎ కార్య దర్శి మురళీ కృష్ణ, కార్యనిర్వహక ఇంజనీర్ రామరాజు తో కలిసి సందర్శించారు. ప్రమాద తీవ్రత ను అడిగి తెలుసుకున్నారు. ఇకపై వి ఎం ఆర్ డి ఎ కి చెందిన అన్ని షాప్ ల్లో ఆదేశించారు. పర్యాటక ప్రదేశాల్లో ఉన్న షాపుల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుం డా అన్నింటిలో కూడా అగ్ని మాపక పరికరాలు ఎట్టిపరిస్థితుల్లో ఉంచాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నోటీసు లు జారీ చేసి జరిమానా విధించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన తో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# నూకాలమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు





- శ్రీ నూకాలమ్మ పండగను అధికారకంగా నిర్వహించాలని
- ముఖ్యమంత్రి చంద్రబాబు కు విజ్ఞప్తి
- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్
- 10,000 మందికి పైగా అన్నదాన కార్యక్రమం
- బొగ్గు శ్రీను ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం

**విశాఖ ఉత్తరం, పెన్ పవర్, మార్చి 26** :కంచరపాలెం బర్మాక్యాంపులో కొలువుదీరిన శ్రీ నూకంబిక అమ్మవారి దేవస్థానంలో జై భారత్ నగర్ గ్రామ అధ్యక్షుడు బొగ్గ శ్రీను ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉగాది పర్వదినాన పురస్కరించుకొని ఏడవ రోజు సందర్భంగా పదివేల మందికి పైగా అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈవో రాజ గోపాల్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు ఉగాది సంబరాలకు ముమ్మర ఏర్పాట్లు చేశా రు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందజేసిన జనసేన నాయకుడు ముక్క శ్రీనివా సరావు (గోల్డ్ మాన్), తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్, ఈవో రాజగోపాల్ కి గ్రామ అధ్యక్షు డు బొగ్గ శీను ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొగ్గ శీను మాట్లాడుతూ 58 వ వార్షికోత్సవ సంద ర్భంగా బర్మా గాంధీశీకుల తరతరాల ఆచార సాంప్రదాయంగా ఇక్కడి అమ్మవారి ఉత్సవాలు ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జరుగుతున్నా యన్నారు. మార్చి 29 తేదీన అమ్మవారి కొత్త సంవత్సరాది ఉగాది పండుగ కు ముమ్మర ఏర్పాట్లు చేశామని చెప్పారు. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా చరిత్ర కలిగిన ఇక్కడి నుకాంబిక అమ్మవారి పండుగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబా బునాయుడు కు విజ్ఞప్తి చేశారు. పది రోజుల పాటు అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించడం పట్ల గ్రామ అధ్యక్షుడు బొగ్గ శ్రీను బృందాన్ని అభినందించారు. గోల్డ్ మాన్ మాట్లాడుతూ అమ్మవారి జాతరలో తాను కూడా భాగస్వామ్యం అవ్వడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. ఆలయ ఈవో రాజ గోపాల్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు జాతర మహెూత్సవానికి ఎంతో సహాయ సహకారాలు అందించార న్నారు. అలాగే గ్రామ అధ్యక్షుడు బొగ్గ శ్రీను ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాలు, అమ్మవారికి విశేషాది కార్యక్రమాలు వైభవంగా జరిగాయన్నారు. అలాగే పండుగకు సహక రిస్తున్న జీవీఎంసీ పారిశుద్ధ కార్మికులు, పోలీ సులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో 40 వ వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి సంగు వాసు, ఉత్సవ కమిటీ సభ్యు రాలు నాగమణి, పీ.వీ.వసంతరావు తదిత రులు పాల్గొన్నారు.

## వీబీ.అగ్రహారం శివాలయాన్ని దర్శించిన ఎలమంచిలి శాసనసభ్యులు......



**నాతవరం,పెన్ పవర్ (మార్చి 26):** దైవ చెంతన ఉంటేనే పాపభీతి ఉంటుందని యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ అన్నారు.బుధవారం మండలంలో గల విబి అగ్రహారం గ్రామంలో వెలిసిన పురాతన శివాలయంలో గత 12 రోజులుగా జరుగుతున్న విశేష పూజలు,హెూమాలు ముగింపు కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ పూర్ణాహుతితో ముగిసిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకి తనకు ముందుగానే ఆహ్వానం అందినప్పటికీ పనుల ఒత్తిడి కారణం వల్ల ముందుగా రాలేకపోయానని ఆయన అన్నారు. మనం చేసే ప్రతి మంచి పనులకు దైవం అండగా ఉండాలని కోరుకోవాలని, దైవచింతన అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతని పొందవచ్చునని అన్నారు. ముందుగా శాసనసభ్యులకు ఆలయ అర్చకులు బ్రహ్మ లింగస్వామి,ఏడిద నాగేశ్వరరావు,శర్మలు ఆహ్వానం పలికి వేదాశీర్వచనం చేశారు.ఈ కార్యక్రమంలో మన్యపురట్ల నీటి సంఘం అధ్యక్షులు అప్పన్న దివానం,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నాటు సారాతో పట్టుబడ్డ మహిళ

ఎక్సైజ్ సి ఐ జే.కూర్మారావు,



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 26 :-** జీకే వీధి మండలం రింతాడ గ్రామంలో ఎక్సైజ్ అధికారులు రైడ్ నిర్వహిస్తుండగా ఒక మహిళ అనుమానస్పదంగా తిరుగుతూ కనిపించింది. ఆమెను ఎక్సైజ్ అధికారులు ఆరా తీయగా ఆమె దగ్గర నాలుగు లీటర్లు నాటు సారా ప్రత్యక్షమైంది. ఆమెను ఎక్సైజ్ అధికారులు తమ కస్టడీకి తీసుకొని 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ రైడ్ లో ఎక్సైజ్ సి ఐ జే.కూర్మారావు, ఎస్సై వి. కరుణలత, కానిస్టేబుల్స్ ఆర్డి నాయుడు మరియు జి. చందర్రావు పాల్గొన్నారు.

## గుర్రాల గొంది గ్రామంలో వైద్య శిబిరం

డాక్టర్ వినయ్ కుమార్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 26**: మండలంలో రింతాడా పంచాయతీ పరిధిలో గుర్రాల గొంది గ్రామంలో ఎపిడమిక్ సీజన్ ను దృష్టిలో పెట్టుకొని డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు పరీక్ష చేసి, ఆర్డిటి పరీక్షలు చేసి ఎవరికి మలేరియా లేదని నిర్ధారణ చేశారు.వారికి సాధారణ జ్వరాలుగా గుర్తించారు. వారికి మందులు ఇచ్చి సకాలంలో వేసుకుంటే వ్యాధులు నయం అవుతాయని డాక్టర్ సూచించారు. గ్రామంలో చిన్న పిల్లల చర్మంపై కురుపులు రావడం చూసిన డాక్టర్ ఇది అమ్మోరు కాదని, పిల్లలు ఎండలో తిరగటం వలన చెమట కురుపులుగా వచ్చాయి అని ఎవరు భయాందోళనకు గురి కావద్దని తెలిపారు. ఉపాధి హామీ పనుల కోసం వెళ్లేవారు ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చేయాలని ఆరారగా మంచినీరు త్రాగాలని, వడదెబ్బ తగలకుండా కాటన్ వస్త్రాలు ధరించాలని, మజ్జిగ కొబ్బరి నీళ్ళు తాగితే మంచిదని తెలిపారు. అత్యవసరం అయితే గాని బయటకు వెళ్ళవద్దని సూచించారు. వ్యాధులు నయం కాకపోతే వెంటనే ఆసుపత్రికి సందర్శించాలని, నాటు వైద్యునికి ఆశ్రయించకూడదు అని, కాచిన నీళ్లు తాగాలి అని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పశువుల శాలలు ఇంటికి దూరంగా కట్టుకోవాలని, 0-5 సంవత్సరాల పిల్లలందరికీ టీకాలు వేయించాలని, గర్భిణీ స్త్రీలు ముందుగానే బర్త్ హెూం సెంటర్లలో చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్ తో పాటు ఎమ్ఎల్ హెచ్ పి నిర్మల, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, సచివాలయం ఏఎన్ఎం కుమారి, 104 సిబ్బంది ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులతో శక్తి టీమ్స్ మమేకమై, ఆత్మ రక్షణకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న శక్తి టీమ్స్'







- జిల్లా ఎస్పీ ఆదేశాలతో విద్యార్థినులు, మహిళ లకు ఆత్మరక్షణ టెక్నిక్స్ నేర్పుతున్న శక్తి టీమ్స్
- ఆపద సమయాల్లో ధైర్యంగా, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని విద్యార్థినులకు
- పిలుపునిచ్చిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,

**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం మార్చి 26** :జిల్లాలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదు వుతున్న విద్యార్థినుల ఆత్మ రక్షణకు అవసర మైన మెళుకువలను విద్యార్థులకు శక్తి టీమ్స్ నేర్పుతూ, వారిలో చైతన్యం నింపుతూ, ఆపద సమయాల్లో ఎటువంటి ఆందోళన చెందకుండా

స్పందించేందుకు అవసరమైన మానసిక పరిప క్వత విద్యార్థులు పొందేందుకు 'శక్తి టీమ్స్' చర్య లు చేపడుతున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిం దల్ మార్చి 26 న తెలిపారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - మహిళలు, విద్యార్థిను లు తమ రక్షణకు స్వయంగా వారే స్పందించే విధంగా అవసరమైన సెల్ఫ్ టెక్నిక్స్ ను 'శక్తి టీమ్స్' నేర్పుతున్నట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. శక్తి యాప్ పట్ల విద్యార్థినులు, మహి ళలకు అవగాహన కల్పించుటలో భాగం గా శక్తి టీమ్స్ కళాశాలలు, పాఠశాలలను సందర్శించే

సమయంలో విద్యార్థినులతో శక్తి టీమ్స్ మమేక మై, కొన్ని సెల్ఫ్ టెక్నిక్స్ ను వారికి నేర్పుతూ, శిక్షణ ఇస్తున్నారన్నారు.ఏదైనా ఆపద సమయం ఏర్పడినపుడు, మహిళల రక్షణకు విఘాతం కలిగే సంఘటన చోటు చేసుకున్నపుడు మహి ళలు,విద్యార్థినులు భయపడకుండా, పరిస్థితిని అర్థం చేసుకొని, వాటిని ఎదుర్కొనేందుకు మానసికంగా సిద్ధమయ్యే విధంగా విద్యార్థి నులు అప్రమత్తం కావాలన్నారు. సమస్య నుండి బయట పడేందుకు ఆత్మవిశ్వాసం, ధైర్యంతో ముందడుగు వేయాలని, ఎవరైనా అనుమానస్పదంగా అనుసరిస్తున్నారని భావిస్తే, జనం ఉన్న ప్రదేశాల్లోకి వెంటనే వెళ్ళేందుకు

ప్రయత్నించడం, ఇతరుల సహాయం పొందే విధంగా బిగ్గరగా అరవడం చేయాలన్నారు. అగంతకులు దాడికి పాల్పడే సమయాల్లో ఆత్మ రక్షణ కొరకు ఎదురు దాడికి దిగి, దాడికి పాల్పడిన వ్యక్తుల సున్నితమైన భాగాలను లక్ష్యంగా చేసుకోవాలని, కళ్ళలో కొట్టడం, ముక్కుపైన గుద్దడం, కాళ్ళ మధ్య భాగంలో తన్నడం చేయాలన్నారు. ఆత్మ రక్షణకు కొన్ని సెల్ఫ్ టెక్నిక్స్ ను విద్యార్థినులు, మహిళలు తప్పనిసరిగా తెలుసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సూచించారు.ప్రతీ మహిళ తమ మొబైల్ ఫోనులో తప్పనిసరిగా శక్తి యాప్ ను డౌన్లోడు చేసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112/100, శక్తి యాప్ లోని ఎస్.ఓ. ఎస్.బటన్ ను ప్రెస్ చేయాలన్నారు. మొబైల్ ఫోన్లులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే మీకు రక్షణ గా ఒక కుటుంబ సభ్యుడు మీతో ఉన్నట్లే నన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్ లోని ఎస్.ఓ.ఎస్. బటన్ ను ప్రెస్ చేస్తే, వారున్న ప్రాంతం వివరాలను, 10 సెకన్ల ఆడియో, వీడియోలను దగ్గరలో ఉన్న పోలీసు స్టేషనుకు చేరుతుందని, తద్వారా పోలీసులు అప్రమత్త మై, వారున్న ప్రాంతానికి క్షణాల్లో చేరుకొని, మహిళలకు రక్షణగా నిలుస్తారన్నారు. కావున, ప్రతీ ఒక్కరూ తమ మొబైల్ ఫోన్లులో శక్తి యాప్ ను డౌన్లోడు, రిజిస్ట్రేషను చేసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ విద్యార్థినులు, మహిళలకు విజ్ఞప్తి చేసారు.

## ప్రజలకు సకాలంలో ధ్రువ పత్రాలు ఇవ్వండి





ఎంపీడీవో యు ఎస్ వి శ్రీనివాసరావు

**చింతపల్లి పెన్ పవర్ మార్చి 26:-**చింతపల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈరోజు ఎంపీడీవో తహాసిల్దారు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు

ఈ సమావేశానికి డిప్యూటీ తహాసిల్దారు పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు డిజిటల్ అసిస్టెంట్ సమావేశం ఏర్పాటు చేసి సచివాలయాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా సిబ్బంది అందరూ కలిసి మెలిసి జనన కుల మరణ పెళ్లిధ్రువపత్రాలు సకాలంలో అందజేయాల్సిందిగా తప్పులు లేకుండా జారీ చేయాల్సింది ఆదేశించడం జరిగింది . ప్రభుత్వ సర్వేలు ఏమి వచ్చినాను అందరూ పాల్గొని సకాలం పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది

## శ్రిష్టి వరల్డ్ స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- శ్రిష్టి కేర్ నెస్ట్ - ప్రాథమిక శిశు వికాసం




**గాజువాక పెన్ పవర్, మార్చి 26:**శ్రిష్టి వరల్డ్ స్కూల్, ఉక్కునగరంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు 2024-25 ఘనంగా నిర్వహించారు .శ్రిష్టి కేర్ నెస్ట్ అనే థీమ్‌తో ప్రాథమిక శిశు వికాసాన్ని ప్రోత్సహించే కార్యక్రమాన్ని ప్రారంభించడం, దేశంలో ఇదే తొలిసారి అని చెప్పుకోవచ్చు.

ఈ వేడుకకు తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రీ-ప్రైమరీ విద్యార్థుల కోసం రూపొందించిన ఈ ప్రత్యేకమైన విద్యా కార్యక్రమాన్ని ఎంతో ప్రశంసించారు. ఆరోగ్యం, పరిశుభ్రత, భవన నిర్మాణం మరియు పిల్లలకు అనుకూలమైన పాఠశాల వాతావరణాన్ని చూసి వారు హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు స్కూల్ టూర్ ద్వారా తమ పిల్లల అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం పొందారు.

ఈ వేడుకలో నృత్య ప్రదర్శనలు, పాటలు వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మరియు ఉపన్యాసాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు తమ ఉన్నత తరగతి యుకేజి ప్రయాణాన్ని ప్రాజెక్టర్ ద్వారా చూసి సంతోషించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల తపన మరియు పాఠశాల నిర్వాహకుల దూరదృష్టిని అభినందించారు. చిన్నారుల భవిష్యత్తు మెరుగుపడేలా పాఠశాల తీసుకుంటున్న చర్యలను వారు మెచ్చుకున్నారు.

ఈ సందర్భంలో శ్రిష్టి వరల్డ్ స్కూల్ డైరెక్టర్ %ు% ఫౌండర్
పి. సుసీలా రాణి మాట్లాడుతూ,

విద్యార్థులకు తల్లిదండ్రులు సూచించిన ఏ చిన్న సమస్య అయినా పాఠశాల ఎంతో బాధ్యతగా, జాగ్రత్తగా పరిష్కరించిందని, అందుకు సమిష్టి కృషి చేసిన టీచర్లు, కోఆర్డినేటర్లు మరియు సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు- 2024-25చిన్నారుల విద్యా ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయని, ప్రాథమిక శిశు విద్యలో శ్రిష్టి వరల్డ్ స్కూల్ చేస్తున్న విశేష కృషికి ఇది నిదర్శనమని ఈ వేడుక నిరూపించిందని యాజమాన్యం పేర్కొంది.

## జోరుగా సాగుతున్న రేషన్ కార్డులో ఈ కేవైసీ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 26:** రేషన్ కార్డుదారుల ఈ కేవైసీ ప్రక్రియను ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ అధికారులకు ఆదేశించటంతో జిల్లాల కలెక్టర్లు పౌరసరఫరాల శాఖ అధికారులకు సర్కులర్ జారీ చేశారు. ఈ కేవైసీ ప్రక్రియను నూటికి నూరు శాతం పూర్తి చేయాలన్న లక్ష్యంతో రేషన్ డీలర్లు,సేల్స్ మెన్లు ఈ పాస్ పరికరాల ద్వారా ఈ కేవైసీ అప్డేట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా దామనాపల్లి పంచాయతీ కట్టుపల్లి రేషన్ డిపోకు సంబంధించి సేల్స్ మాన్ అరుకు కృష్ణ లబ్ధిదారుల ఇండ్లకు నేరుగా వెళ్లి ఈ కేవైసీ అప్డేట్ చేస్తున్నారు. బుధవారం దొడ్డికొండ బొర్రా మామిడి గ్రామాలలో ఈ కేవైసీ చేశారు.ఈ కేవైసీ గడువు ఈనెల 31 తో తీరానుందని ఈ కేవైసీ చేసుకోకపోతే రేషన్ కార్డుదారులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కావున ఈ కేవైసీ చేయించుకొని ప్రతి ఒక్కరూ ఈ కేవైసీ చేయించుకోవాలని పిలుపునిచ్చారు.

# సూపర్ సర్పంచులు సర్వసభ్య సమావేశంలో మాట్లాడే రైట్ లేదు.....

మండల పరిషత్ అధ్యక్షులు సాగిన లక్ష్మణమూర్తి.....






**నాతవరం,పెన్ పవర్(మార్చి 26):** మండల సర్వసభ్య సమావేశానికి సూపర్ సర్పంచులు,సూపర్ ఎంపీటీసీలు వచ్చి మాట్లాడే రైట్ లేదని మండల పరిషత్ అధ్యక్షులు సాగిన లక్ష్మణ మూర్తి అన్నారు.బుధవారం మండల కేంద్రమైన నాతవరంలో గల మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య శాన్ని మండల పరిషత్ అధ్యక్షులు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సభలో సూపర్ సర్పంచులు,అధికారులు సరైన రీతిలో మాకు సహకరించడం లేదని అన్నారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో గల సమస్యలను అధికారులును అడగాలంటే సర్పంచులు,ఎంపీటీసీలు తప్పనిసరిగా సర్వసభ్య సమావేశాలకు హాజరుకావాలని, అలా హాజరైతేనే గ్రామాల్లో గల సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉంటుందని తద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని అన్నారు. ఇకపై సూపర్ సర్పంచులు, సూపర్ ఎంపీటీసీలు సర్వసభ్య సమావేశాలకు రావద్దని ఆయన వ్యాఖ్యానించారు.అనంతరం వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిని కె,ఉషశ్రీ, జడ్పిటిసి కాపారపు అప్పల నరస,మండల వైస్ ఎంపీపీ పైల సునీల్,మండల పరిషత్ ఏవో పీ,పార్థసారథి,సిడిపిఓ గౌరీ, ఆర్డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ దేవ దత్త,మండల విద్యాశాఖ అధికారి కామిరెడ్డి వరహాల బాబు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎ.జోగారావు

ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్. పార్థసారథి,పిఆర్.అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరమ్మ,వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు,ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# కీర్తిశేషులు ఆనంద గజపతిరాజు చిత్రపటానికి నివాళులర్పించిన ఈవో



**సింహాచలం, పెన్ పవర్, మార్చి 26 :** శ్రీ వరాహాలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలం పూర్వపు అనువంశిక ధర్మకర్త కి"శే ,ఆనంద గజపతిరాజు 10వ వర్ధంతి సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సుబ్బారావు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాచరిక వ్యవస్థలో పుట్టి సామాన్యుల సంక్షేమం కోసం సామ్యవాదాన్ని అనుసరించిన మహాదాత విద్యా ప్రదాత సింహాచలం పూర్వపు అనువంశిక ధర్మకర్త ఆనంద గజపతిరాజుని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు పర్యవేక్షణాధికారి సునీల్. లీగల్ అడ్వైజర్ ప్రసాద్ వర్మ, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీసీ వసతి గృహ వంట కుక్ హఠాన్మరణం.

సత్యవతి హఠాన్మరణం బాధాకరం.



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 26:-** చింతపల్లి వెనుకబడిన తరగతుల బాలికల ఆశ్రమ వసతి గృహ వంటకుక్ బండి సత్యవతి హఠాన్మరణం చెందారు. వసతి గృహ అధికారిని పసుపులేటి శకుంతల అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం గడచిన 23 ఏళ్ళుగా బీసీ సంక్షేమ వసతి గృహంలో వంట కుక్ గా పనిచేస్తున్న సత్యవతి గతంలో కొన్నేళ్లు ఇక్కడ పనిచేసే బదిలీ అయ్యారన్నారు. తరువాత మరలా ఇదే ఆశ్రమ వసతి గృహానికి మూడేళ్ల క్రితం బదిలీపై వచ్చారన్నారు. మంగళవారం అస్వస్థతకు గురైన ఆమెను ఆసుపత్రికి తరలించే లోపే తుది శ్వాస విడిచారన్నారు. ఆమె స్వస్థలం కొయ్యూరు మండలం కాకరపాడన్నారు. ఆమెకు వివాహితులైన కుమార్తె, కుమారుడు ఉన్నారన్నారు. కుమారునికి సమాచారం ఇచ్చి మృతదేహాన్ని స్వగ్రామం తరలించినట్లు ఆమె తెలిపారు. సత్యవతి మృతికి ఆమె ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వసతి గృహ సిబ్బంది, విద్యార్థినిలు సత్యవతి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమం.






**గుమ్మలక్ష్మీపురం 26, మర్చి.పెన్ పవర్.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సాధికార సంస్థ సహకారంతో రైన్ ఫారెస్ట్ అలియన్స్ నిర్వహణలో, జట్టు సంస్థ ఆధ్వర్యంలో మామిడి, జీడి మరియు పసుపు పంటలకు రైన్ ఫారెస్ట్ అలియన్స్ సర్టిఫికేషన్ చేయు విధానంపై మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతు సాధికార సంస్థ సిలబస్ డవల్మెంట్ సీనియర్ కన్సల్టెంట్, జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు మరియు ముఖ్య సలహాదారు అయిన డాక్టర్ డి పారి నాయుడు అధ్యక్షతన తోటపల్లిలో గల జట్టు ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన మూడురోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు ముగింపు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నీల్ కాంత్ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మి పురం మండలంలో జీవ ప్రాజెక్ట్ పరిధిలోని 28 గ్రామాలలో ఉన్న ఆది తల్లి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ రైతులు తమ పండించే పంటలు ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ చేసుకోడానికి అనువుగా రైన్ ఫారెస్ట్ అలయన్స్ ధృవీకరణను ఎఫ్ .పి. ఓ ద్వారా చేపట్టే అవకాశం రావడం రైతులకు శుభపరిణామమని ఆయన తెలిపారు. ఒక వ్యక్తి చదువును నిర్ణయించేది సర్టిఫికెట్ అయితే, అదేవిధంగా రైతులు పండించే పంట ఉత్పత్తుల నాణ్యతను, అందులోని రసాయన అవశేషాల స్థాయిని నిర్ణయించేది పంటల ధృవీకరణ ఆధారంగా వాటి యొక్క అమ్మకాలు మరియు వినియోగం ఆధారపడి ఉంటుందని అన్నారు. అదే విదంగా, దక్షిణాసియా దేశాలలో కాఫీ, కోకో, టి ,అరటి, పామాయిల్, సుగంధ ద్రవ్యాలు మొదలగు పంటలకు సర్టిఫికెట్ చేయడం జరుగుతుందని సూచించారు అంతే కాకుండా ఇప్పుడు జీడి పంటకు ఉన్న ఆదరణ ఆధారంగా జీడి , మామిడి పంటలపై సర్టిఫికెట్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు.

కన్సల్టెంట్ డాక్టర్ :- డి. పారి నాయుదు మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలలో ప్రకృతి వ్యవసాయం సులభంగా అర్థమయ్యే విధంగా ఆచరణ చేయడానికి అనుకూలంగా పాఠ్య పుస్తకాలను తయారు చేయడం జరిగినదని ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహాయ సహకారాలతో పిల్లలు నేర్చుకొని తమ పాఠశాల ప్రాంగణాలలో పంటలు పండించుకుని ఆ అనుభవంతో ఇంటి వద్ద వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, వారు బావి తరాలకు స్ఫూర్తి కలిగేలా సాగు చేపట్టాలని ఆయన అన్నారు. అదే విదంగా భవిష్యత్తులో వ్యవసాయమే విలువైన వృత్తిగా భావించే రోజులు వస్తాయని ఆహారోత్పత్తి ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని, విద్యతో పాటు వ్యవసాయం కూడా ఒక ఉపాధి మార్గంగా గుర్తించాలని అన్నారు. రైన్ ఫారెస్ట్ అలయన్స్ ధృవీకరణ కార్యక్రమం ద్వారా గిరిజన రైతులు వారి పంట ఉత్పత్తులను ఎక్కడికైనా ఎగుమతులు చేసుకునే అవకాశం ఉన్నందున ప్రకృతి వ్యవసాయ విధానాలతో పండించి నాణ్యమైన ఆహారాన్ని వినియోగదారులకు అందించాలని ఆయన కోరారు. ప్రాజెక్టు రాష్ట్ర అధికారి పి.వినూత్న మాట్లాడుతూ రైతుల యొక్క సుస్థిర మరియు మెరుగైన నిరంతర అభివృద్ధితో పాటు జీవ వైవిధ్య, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా రైన్ ఫారెస్ట్ అలయన్స్ పని చేస్తుందని, ఉత్పత్తి దారుల, వినియోగదారుల మరియు వాతావరణం ఆరోగ్యకరమైన సంబంధాలను పెంచే దిశగా కార్యాచరణ చేస్తున్నామని ఆయన సూచించారు. అంతే కాకుండా ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు అందరూ లాభాలను అందుకునేలా చేస్తామని, జీడి రైతుల శ్రేయస్సు దృష్ట్యా సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయుటకు నిర్ణయించామని అందులో భాగంగానే ఈ మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించామని ఆయన తెలిపారు. ముగింపు కార్యక్రమం అనంతరం జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు (డి.పి.యం) మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో రైతులు వ్యవసాయం చేయడం పెను భారంగా భావిస్తున్న తరుణంలో పెట్టుబడులు పెరగడం, దిగుబడులు తగ్గడం ,పండిన పంటలకు మార్కెట్లో ధర అనుకూలంగా లేకపోవడం, వ్యవసాయంలో కూలీల లభ్యత తగ్గడం మరియు పెట్టుబడులు పెరగడం వలన రైతులకు వ్యవసాయంపై ఆసక్తి సన్నగిల్లేలా చేస్తోందనిఅన్నారు. అటువంటి పరిస్థితులు మెరుగుపరుచుకోవడానికి పండించిన పంటలను సర్టిఫికెట్ చేయడం ద్వారా తగిన లాభాలను అందుకుని అభివృద్ధి చెందుతారని ఆశాభావం వ్యక్తం చేయడం జరిగిందని సూచించారు.

ఈ కార్యక్రమంలో రైన్ ఫారెస్ట్ అలయన్స్ సర్టిఫికేషన్ కాన్సల్టెంట్ల బృందం నేపా, శ్రీధర్, రోజా చంద్, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. ప్రహరాజ్, బడినుండి పొలం బడికి కన్సల్టెంట్ టి. శివాజీ,ఏ.పీ.సీ.ఎన్.ఎఫ్ ఎం.ఎం.ఎల్ గణేష్ శరత్ చంద్ర, జీవ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. ప్రబోధ్, అధితల్లి సీఈఓ పెకాపు మురళీ, డైరెక్టర్లు సీతారాం, ప్రసాద్,గౌరీశంకర్, మిన్నా రావు, భీమా రావు, కొండబారిడి లాండ్ స్కేప్ కో ఆర్డినేటర్ మణికుమార్, జట్టు సిబ్బంది, మా తోట రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సెటిల్ బ్యాట్మెంట్ కోర్టు ప్రారంభించిన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు





**గోపాలపట్నం, పెన్ పవర్, మార్చి 26 :** జీవీఎంసీ 91వ వార్డు, గోపాలపట్నం, లక్ష్మీ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మైదానంలో షటిల్ కోర్ట్ ను ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెథకం శెట్టి గణబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామ సభ్యులతో షటిల్ బ్యాట్మెంటన్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ క్రీడలు ఆడినప్పుడు నాకు తెలియలేని ఉత్సాహం కలుగుతుందని, ఆటలు వలన మానసిక ఒత్తులు, ఆరోగ్యపరమైన సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. క్రీడలు ఆడిన, క్రీడాకారులను చూసిన నాకు ఎంతో సంతోషంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం టిడిపి 91వ వార్డ్ అధ్యక్షులు నారపల్లి సత్తిరాజు మాట్లాడుతూ మా నాయకుడు గణబాబు షటిల్ కోర్ట్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. షటిల్ కోర్టుతో పాటు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్బాల్ కోర్టులు కూడా ఈ మైదానంలో ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యేతో మాట్లాడామని, ఈ విషయమై ఆయన కూడా సానుకూలంగా స్పందించారన్నారు. స్కూల్ మైదానంలో లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకి విన్నవించడం జరిగిందన్నారు. స్పోర్ట్స్ విషయంలో ఎమ్మెల్యే ముందంజలోనే ఉంటారని, క్రికెట్ కిట్లు, బాస్కెట్బాల్, షటిల్నట్స్ ఇవన్నీ కూడా అతి త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఇందుగుబిల్లి ఉమామహేశ్వరరావు, జై బీమా సంక్షేమ సంఘం అధ్యక్షులు బండి దుర్గేష్, జనసేన నాయకులు గరికిన వీరిబాబు, శివ, కూటమి నాయకులు నరవ అనూష, గ్రామ పెద్దలు, రవీంద్ర యూత్ అసోసియేషన్ సభ్యులు గరికిన శ్రీనివాసరావు, రమేష్, ఆదినారాయణ, స్కూల్ ప్రిన్సిపాల్ మెట్ట మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మరియు భారతదేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్ రావ్ విగ్రహాల ఆవిష్కరణను విజయవంతం చేయండి.



**పెన్ పవర్, పాయకరావుపేట న్యూస్: మార్చి 26** ఏప్రిల్ ఒకటో తేదీన రాష్ట్ర హెూం శాఖ విపత్తుల మంత్రివర్యులు శ్రీ వంగలపూడి అనిత చేతులమీదుగా ఘనంగా పాయకరావుపేట దుర్గా కాలనీలో బాబు జగజ్జివన్ రావు యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరుగుచున్నది. కావున ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు మహారధులు జిల్లా నాయకులు అందరూ విజయవంతం చేయాలని విగ్రహాల ఆవిష్కరణ కమిటీ అధ్యక్షులు తుమ్మలపల్లికుమార్, తుమ్మలపల్లి తాతబ్బాయి, 20వ వార్డ్ మెంబర్ తుమ్మలపల్లి సతీష్ ఎంఆర్పిఎస్ నాయకులు తుమ్మలపల్లి పండు, ఏడిద సునీంద్ర, ఈతలపాకు అప్పారావు, తుమ్మలపల్లి సురేష్ మరియు గ్రామ పెద్దలు మహిళలు యూత్ సభ్యులు కోరారు.

# అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిడిఎస్ సిడిపిఓ ఏ లక్ష్మీదేవి

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్ మార్చి 26:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో పలు అంగన్వాడీ కేంద్రాలకు ఆయాలు, దారకొండ పంచాయితీ ఏనుగు బైలు గ్రామ అంగన్వాడీ కేంద్రానికి మినీ కార్యకర్త పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ ఏ లక్ష్మీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఎం జాన్మన్ ద్వారా వంచులా పంచాయతీ తీములగుంట గ్రామంలో అంగన్వాడీ కార్యాలయానికి ఆయా పోస్ట్ కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, లక్కవరపేట పంచాయితీ సురవరం గ్రామ అంగన్వాడీ కేంద్రానికి ఆయా పోస్ట్, సంకాడ పంచాయతీ గోవాడ అంగన్వాడీ కేంద్రంలో ఆయా పోస్ట్ కు, దారకొండ పంచాయతీ ఏనుగు బైలు అంగన్వాడీ కేంద్రానికి మినీ కార్యకర్త పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు స్థానిక గ్రామస్తులై ఉండాలని, కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల మహిళ అభ్యర్థులు ఈ దరఖాస్తులను మార్చి 26వ తేదీ నుండి ఏప్రిల్ 10వ తేదీ సాయంకాలం 5 గంటల వరకు స్థానిక శిశు అభివృద్ధి సంక్షేమ అధికారి ఐసిడిఎస్ కార్యాలయంలో నేరుగా గాని, పోస్ట్ ద్వారా గాని దరఖాస్తులు పంపించవచ్చునని తెలిపారు.

# అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం





**సింహాచలం, పెన్ పవర్, మార్చి 26 :** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

# ముస్లిం సోదరుల ఇఫ్తార్ విందులో పాల్గొన్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



**గోపాలపట్నం, పెన్ పవర్, మార్చి 26 :** జీవీఎంసీ 92వ వార్డు, వెంకటాపురం, నందమూరినగర్లో పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెథకం శెట్టి గణబాబు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు ముస్లిం సోదరులకు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆర్వోబీలతో మహార్దశ

**గుంటూరు, మార్చి 26, పెన్ పవర్:** ఏపీలో కొత్తగా మరో ఆర్‌వోబీ నిర్మాణం కానుంది. ఏపీలో టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత.. పలు ప్రాజెక్టులకు మోక్షం కలుగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు లభిస్తు?న్నాయి. ఈ క్రమంలోనే కేంద్రం నుంచి ఏపీకి మరో గుడ్ న్యూస్ అందింది. మంగళగిరిలో ఆర్‌వోబీ నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.129.18 కోట్లతో మంగళగిరి ఆర్వోబీ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఆ మేరకు నిధులు మంజూరు చేస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. మంగళగిరిలో ఆర్‌వోబీ నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైల్వే శాఖను ఇటీవల అభ్యర్థించారు. కేంద్ర మంత్రి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రైల్వే శాఖ.. మంగళగిరిలో నాలుగు వరుసల ఆర్‌వోబీ నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేసింది.గుంటూరులోని గడ్డిపాడు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సైతం రైల్వేశాఖ ఇటీవల నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. గడ్డిపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 107.79 కోట్లు మంజూరు చేసింది. రైల్వే గేటు కారణంగా ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో విజయవాడవైపు వెళ్లే వారికి నిరీక్షణ తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఆర్‌వోబీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. గుంటూరు–నంబూరు రైల్వేస్టేషన్ల మధ్య గడ్డిపాడు వద్ద నాలుగు వరుసలుగా దీనిని నిర్మిస్తారు. ఈ ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే పేరేచర్ల నుంచి విజయవాడ వెళ్లేవారికి అనుకూలంగా ఉంటుంది. అలాగే హైదరాబాద్, నరసరావుపేట, పల్నాడు నుంచి వచ్చే భారీ వాహనాలను గుంటూరులోకి రాకుండా దారి మళ్లించేందుకు వీలవుతుంది.మరోవైపు గుంటూరులో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు శంకర్ విలాస్ పైవంతెనతో పాటుగా ఆర్వోబీల నిర్మాణం చేపడతామని ఎన్నికల సమయంలో పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ఇక ఇచ్చిన హామీ ప్రకారం కేంద్ర సహాయ మంత్రి హోదాలో నిధుల మంజూరుకు ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలోనే ఇప్పటికే గుంటూరు శంకర్‌విలాస్ ఫ్లైఓవర్‌కు ఇటీవల రూ. 98 కోట్లు మంజూరు చేయించారు.

## బొలివియాలోనూ... నిత్యానందుడి ఆరాచకాలు

**హైదరాబాద్, మార్చి 26, పెన్ పవర్:** కైలాస దేశాన్ని సృష్టించడం ద్వారా ప్రపంచం మొత్తాన్ని ఆశ్చర్యపరిచిన స్వయం ప్రకటిత సన్యాసి నిత్యానంద మరోసారి వార్తల్లో నిలిచారు. నిత్యానంద ఇప్పుడు కైలాస సరిహద్దులను విస్తరించాలనుకుంటున్నాడని చెబుతున్నారు. ఇందుకోసం దక్షిణ అమెరికాలోని బొలీవియాపై దాడి చేశారు. నిత్యానంద తన శిష్యులతో కలిసి అక్కడ 4.8 లక్షల హెక్టార్ల భూమిని ఆక్రమించారు. ఈ సమాచారం అందిన వెంటనే, భారతదేశం నుండి బొలీవియా వరకు ప్రభుత్వాలు కార్యాచరణలోకి దిగాయి.నిత్యానంద తోపాటు అతని శిష్యులు మొదట బొలీవియాలోని గిరిజనుల భూమిని మోసపూరితంగా కొనుగోలు చేశారు. భూమిని కొనుగోలు చేసిన తర్వాత, నిత్యానంద దానిని కైలాస విస్తరణగా ప్రకటించడానికి ప్రయత్నించాడు. కానీ అంతకు ముందే భూమి కొనుగోలు వార్త మీడియాకు లీక్ అయింది. నిత్యానంద, ఆయన శిష్యులు కలిసి బొలీవియాలోని 4 లక్షల 80 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని తమ పేర్లపైకి మార్చుకున్నారని ఆరోపించారు. ఈ భూమిని 1000 సంవత్సరాలకు లీజుకు తీసుకున్నట్లు పత్రాలు సృష్టించుకున్నారు. భూమికి లీజు మొత్తం సంవత్సరానికి రూ. 8.96 లక్షలు, నెలవారీ మొత్తం రూ. 74,667, రోజువారీ మొత్తం రూ. 2,455 గా ప్రతిపాదించారు.ఈ మేరకు బొలీవియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ, బొలీవియా "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కౌలాస" అని పిలువబడే దేశంతో దౌత్య సంబంధాలను కొనసాగించడం లేదని, ఎందుకంటే అంతర్జాతీయ సమాజంలో మరే ఇతర దేశం కూడా వారిని ఒక దేశంగా గుర్తించలేదని పేర్కొంది. అంతర్జాతీయ కథనాల ప్రకారం, కైలాస ప్రతినిధులు భూమిని స్వాధీనం చేసుకోవడానికి బొలీవియాలో చాలా నెలలుగా ఉన్నారు. ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి స్థానిక నాయకుల సహాయం తీసుకున్నారు. ఒప్పందం ఖరారైన తర్వాత, నిత్యానంద బృందం ప్రజల నుండి ఒప్పందంపై సంతకం చేయించుకుంది.అయితే, ఈ వార్త వెంటనే స్థానిక మీడియాకు లీక్ అయింది. మీడియాలో వార్తలు వచ్చిన తర్వాత, నిత్యానంద, అతని శిష్యులు స్థానిక జర్నలిస్టులను బెదిరించారని, అయతే ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగినప్పుడు, నిత్యానంద ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేసిందని చెబుతున్నారు.2019 నుండి భారతదేశం నుండి పరారీలో ఉన్నాడు. అతనిపై అనేక తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. దేశం విడిచి పారిపోయిన నిత్యానంద కైలాస అనే నకిలీ దేశాన్ని స్థాపించారు. దానికి సొంత కరెన్సీ, రాజ్యాంగం ఉందని చెప్పుకుంటున్నారు. 2010 సంవత్సరంలో, నిత్యానందకు సంబంధించిన ఒక అశ్లీల సీడీ బయటకు వచ్చింది. దాని కారణంగా అరెస్టు కూడా చేశారు పోలీసులు. 2012లో నిత్యానందపై అత్యాచారం కేసులు నమోదయ్యాయి. 2019లో, ఇద్దరు బాలికలను కిడ్నాప్ చేసి బందీగా ఉంచినందుకు నిత్యానందపై కేసు నమోదైంది. ఇక తర్వాత నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. నిత్యానంద దేశం విడిచి పారిపోవడం వల్ల అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయారు భారతీయ పోలీసులు.

## రోడ్డు ప్రమాదంలో 13 మందికి తీవ్ర గాయాలు

**యాదాద్రి: పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది బుధవారం తెల్లవారుజామున విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న భారీ కంటైనర్ ను వెనుక నుండి ఆరంజ్ ట్రావెల్ , సాయి కృష్ణ ట్రావెల్స్ బస్సులు ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో 13 మందికి తీవ్ర గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా వుంది. క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రి తరలించారు. .. అరెంజ్ ట్రావెల్ బస్సు డ్రైవర్ క్యాబిన్ లో ఇరుక్కు పోవడం తో క్రేన్ సహాయం తో బయటకు తీసారు. ఘటనతో జాతీయ రహదారి పై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పాడింది. సంఘటన స్థలానికి ఏసీబీ మధుసూదన్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డి చేరుకొని సుమారు రెండు గంటల పాటు శ్రమించి వాహనాలను తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేసారు. సిన పోలీసులు.....

## ఆరు పథకాల అమలు కాలేదని బీజేపీ నిరసన

**యాదాద్రి: పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న ఆరు పథకాలు అమలుపరచలేదని పెద్ద ఎత్తున మహిళల నుండి దరఖాస్తులను సేకరిస్తున్న బిజెపి శ్రేణులు ఈ కార్యక్రమంలో మునుగోడు బిజెపి కన్వీనర్ దూడలబిక్షం, శాగ చంద్రశేఖర్ రెడ్డి, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

తరువాత బీజేపీ నాయకులు మాట్లాడుతూ

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా ఆరు పథకాలు అమలు పరచాలని మరియు ఆసరా పింఛన్లు 4000 రూపాయలు మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని చెప్పి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతున్న అమలుపరచలేదని దానికి నిరసనగా మునుగోడు నియోజకవర్గంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో దరఖాస్తుల స్వీకరిస్తున్నాం ఈ కార్యక్రమానికి మహిళల నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తుంది... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అమలుపరిచే వరకు బిజెపి పార్టీ ప్రజల తరపున పోరాడుతుందని తెలిపారు.....

# పాస్టర్ ప్రవీణ్ హత్య.. ప్రమాదమా



**రాజమండ్రి, మార్చి26, పెన్ పవర్:** పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. క్రైస్తవ మత ప్రచారకుడిగా, బోధకుడుగా ఆయన రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా సుపరిచితుడు. అలాంటి వ్యక్తి సడన్ గా చనిపోయారనే వార్త క్రైస్తవ సమాజం నమ్మలేకపోతోంది. అదే సమయంలో ఆయనది అనుమానాస్పద మృతిగా తేలడం ఇక్కడ సంచలనంగా మారింది.ప్రవీణ్ పగడాల విజయవాడనుంచి రాజమండ్రి వెళ్లి, రాజమండ్రి నుంచి రాజానగరం వెళ్లేటప్పుడు బుల్లెట్ పై వెళ్తూ రోడ్డుపక్కన చనిపోయి పడి ఉన్నారు. స్థానికులు కొందరు ఆవైపుగా వెళ్తూ ఆయన మృతదేహాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన డెడ్ బాడీ చూసినవారు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆయన్ని ఎవరో చంపి పడివేసి ఉంటారని ఆరోపణలు వినపడుతున్నాయి. ఆయన మృతదేహంపై గాయాలున్నాయని, పెదాలపై కూడా గాయాలున్నాయని, రాడ్డుతో కొట్టినట్టు గాయాలు కనపడుతున్నాయని అంటున్నారు. ప్రవీణ్ పగడాల మృతదేహాన్ని రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించగా అక్కడ క్రైస్తవ సోదరులు ధర్నా చేపట్టారు.ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆయన అభిమానులు, క్రైస్తవులు రాజమండ్రిలో ధర్నా చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మతోన్మాదులు ఆయన్ని చంపి ఉంటారని వారు అంటున్నారు. గంటలతరబడి రోడ్డుపై ఆందోళన చేస్తున్నా.. తమని ఎవరూ పట్టించుకోవట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే స్పందించాలని కోరారు. గతంలో ఆయన్ను చాలామంది బెదిరించేవారని, ఆయనపై దాడి చేస్తామని కూడా హెచ్చరించారని అంటున్నారు. ఇటీవల ప్రవీణ్ పగడాల కూడా తనపై దాడి జరిగే అవకాశం ఉందని అనుమానించారని, దానిపై ఆయనే ఒక వీడియో పోస్ట్ చేశారని చెబుతున్నారు. తనకు ప్రాణ భయం ఉందని ప్రవీణ్ పగడాల చెప్పినా కూడా పోలీసులు ఆయనకు రక్షణ కల్పించలేకపోయారని క్రైస్తవ మత ప్రచారకుడు, పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో సంచలనం రేపుతోంది. రాజమండ్రి దివాన్ చెరువు – కొంతమూరు జాతీయ రహదారిపై ప్రవీణ్ పగడాల మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. పక్కనే బైక్ ఉండటంతో బైక్ ప్రమాదంలో ప్రవీణ్ పగడాల చనిపోయినట్లు తొలుత భావించారు. అయితే ప్రవీణ్ పగడాల శరీరంపై గాయాలు కనిపించాయంటూ.. ఆయన అనుచరులు ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల.. రాజమండ్రికి ఎందుకు వెళ్లారనేదీ తెలియడం లేదు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి బైక్ మీద వెళ్తున్నారంటూ కొన్ని వార్తలు వస్తున్నాయి.బైక్ మీద వెళ్తున్న సమయంలో వెనుక నుంచి ఢీకొట్టి, దాడి చేసి ఉంటారంటూ ప్రవీణ్ పగడాల సన్నిహితులు, అనుచరులు ఆరోపిస్తున్నారు. ప్రవీణ్ పగడాల ఒంటిపై గాయాలు ఉండటంతో సమగ్ర విచారణ జరపాలని స్నేహితులు, అనుచరులు, కొంతమంది పాస్టర్లు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పోలీసులు కూడా పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై దర్యాప్తు జరుపుతున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ఘటనాస్థలికి వరకూ మొత్తం సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. మరోవైపు పాస్టర్ ప్రవీణ్ మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై వస్తున్న అనుమానాలపై విచారణ చేయాలని టీడీపీ నేత, మహాసేన రాజేష్ సైతం డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ప్రవీణ్ పగడాల క్రైస్తవ మత బోధకుడిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అనుచరుల్ని సంపాదించుకున్నారు. కడప జిల్లాతో ఆయనకు అనుబంధం ఉంది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ లో నివశిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బోధనకోసం ఆయ అప్పుడప్పుడు వివిధ ప్రాంతాలకు వస్తుంటారు. ఈ క్రమంలో రాజమండ్రి వద్ద కార్యక్రమాలకు వచ్చిన ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు తెలుస్తోంది.ప్రవీణ్ పగడాల మృతిపై పలువురు క్రైస్తవ మత ప్రచారకులుగ్ర్భ్భాంతి వ్యక్తం చేశారు. ఒకప్పటి సినీ హీరో, ప్రస్తుతం

మత ప్రచారకుడిగా ఉన్న రాజా కూడా ప్రవీణ్ పగడాల మృతిపై స్పందించారు. ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ప్రవీణ్ మృతి బాధాకరం అని అన్నారు. ఆయన లేని లోటు తీరదని, భౌతికంగా మాత్రమే ఆయన క్రైస్తవ సమాజానికి దూరమయ్యారని చెప్పారు. ఆయన కుటుంబం కోసం ప్రార్థన చేయాలంటూ పిలుపునిచ్చారు.ప్రవీణ్ పగడాల మరణంపై పోలీసులు ఇంకా క్లారిటీ ఇవ్వలేదు. ఆయన డెడ్ బాడీని స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టమ్ కోసం తరలించారు. ఈ విషయంలో పోలీసుల నుంచి ప్రకటన విడుదలైతే దీనిపై మరింత క్లారిటీ వచ్చే అవకాశముంది. అప్పటి వరకు ప్రవీణ్ పగడాల మృతిని ప్రమాదంగా ధృవీకరించలేం, అదే సమయంలో అది హత్య అనేది కూడా నిర్ధారించలేని పరిస్థితి.

# పోసాని ఎక్కే గుమ్మం... దిగే గుమ్మం...

**విజయవాడ, మార్చి 26, పెన్ పవర్:**

పోసాని కృష్ణమురళికి బెయిల్ లభించింది. కానీ ఆ ఆనందం ఆయనకు ఎక్కువ రోజులు నిలవలేదు. ప్రతి సోమవారం తో పాటు గురువారం సిఐడి కార్యాలయానికి వచ్చి సంతకాలు చేయాల్సి ఉంది. సిఐడి కోర్టు బెయిల్ ఇచ్చినప్పుడే ఈ షరతు పెట్టింది. దీంతో పోసాని కృష్ణ మురళికి బెయిల్ అయితే లభించింది కానీ.. కేసుల నుంచి విముక్తి కలిగేలా కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. గత నెల 26న ఆయన అరెస్ట్ అయ్యారు. కేసుల మీద కేసులు నమోదయ్యాయి. కస్టడీల మీద కస్టడీలు కొనసాగాయి. చివరకు 24 రోజుల అనంతరం ఆయన జైలు నుంచి విముక్తి పొందారు.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు పోసాని కృష్ణ మురళి. ఫోటో మార్ఫింగ్ చేసి సైతం ఆయన కామెంట్స్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. తొలుత ప్రకాశం జిల్లా పోలీసులు గత నెల 26న హైదరాబాదులో కృష్ణ మురళిని అదుపులోకి తీసుకున్నారు. అది మొదలు ఆయనపై కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లా జైలులకు తరలిస్తూ ఆయన కస్టడీ 24 రోజులు పాటు కొనసాగింది. కొద్ది రోజుల కిందట అన్ని కేసులలో ఆయనకు బెయిల్ లభించింది. కానీ ఇంతలో సిఐడి పీటి వారెంట్ ఇచ్చింది. దీంతో పోసానిని కర్నూలు నుంచి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. అయితే న్యాయస్థానంలోనే తనకు ఆరోగ్యం బాగా లేదంటూ పోసాని కృష్ణ మురళి కన్నీటి పర్యాంతం అయ్యారు. అయినా సరే అప్పట్లో న్యాయస్థానం ఆయన రిమాండ్ ను కొనసాగించింది.ఈ నెల 21న పోసాని కృష్ణ మురళి సిఐడి కోర్టులో బెయిల్ పిటిషన్ వేశారు. మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. దీంతో కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. రెండు లక్షల పూచికత్తుతో ఆయనకు బెయిల్ ఇచ్చింది కోర్టు. ప్రతి సోమ, గురువారాల్లో సిఐడి కార్యాలయానికి వచ్చి సంతకం చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. మీడియాతో కేసుల గురించి అస్సలు మాట్లాడకూడదు అని సూచించింది. అదే సమయంలో పోసాని కృష్ణ మురళికి సిఐడి విచారణకు సహకరించాలని కూడా ఆదేశాలు ఇచ్చింది. దీంతో పోసాని కృష్ణ మురళికి ఉపశమనం దక్కలేదని తేలిపోయింది. తదుపరి కొనసాగింపు కూడా ఉంటుందని స్పష్టమైంది.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పోసాని కృష్ణ మురళి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కాస్త యాక్టివ్ గానే కనిపించారు. అయితే ఉన్నట్టుండి ఆయన ఓ రోజు కీలక ప్రకటన చేశారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని తేల్చేశారు. ఇకనుంచి రాజకీయాలు మాట్లాడనని కూడా చెప్పుకొచ్చారు. అయితే గతంలో పోసాని కృష్ణ మురళి చేసిన కామెంట్స్ ను టిడిపి, జనసైనికులు మరిచిపోలేదు. అందుకే పాత కేసులు తెరపైకి వచ్చాయి. పోసాని అరెస్టు జరిగింది. ఆయనకు బెయిల్ లభించింది. అయితే అది మనశ్శాంతి లేని బెయిల్ అని తేలిపోయింది. సో ముమ్ముందు పోసాని వ్యవహార శైలి బట్టి కేసుల తీవ్రత ఉంటుందని విశ్లేషకులు సైతం తేల్చి చెబుతున్నారు.



### ఇక పీకల్లోతు కష్టాల్లో బోరుగడ్డ

బోరుగడ్డ అనిల్ కుమార్(విషయంలో హైకోర్టు తీవ్ర వ్యాఖ్యానాలు చేసింది. ఆయన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో బోరుగడ్డ మరోసారి కేసుల ఉచ్చులో పడాల్సి వచ్చింది. గత వైసిపి ప్రభుత్వంలో కూటమినేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడేవారు బోరుగడ్డ. వ్యక్తిగత కామెంట్లకు సైతం వెనుకడుగు వేసే వారు కాదు. చాలా రకాలుగా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, చంద్రబాబు, లోకేష్ లపై వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబ పరంగా కూడా విమర్శలు చేశారు. అనుచిత వ్యాఖ్యలు కొనసాగించారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు చుక్కలు కనిపిస్తున్నాయి. తాజాగా కోర్టు ధిక్కరణ కింద కూటమి ప్రభుత్వానికి ఆయన అస్త్రం అందించారు. దానిపైనే కేసులు నమోదు కావడంతో ఆయన హైకోర్టు ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది.రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండేవారు బోరుగడ్డ. ఆ సమయంలో తన తల్లికి అనారోగ్యం ఉందంటూ ఆయన మధ్యంతర బెయిల్ పొందారు. అయితే సకాలంలో రాజమండ్రి జైల్లో తిరిగి లొంగిపోలేదు. అదే ఇప్పుడు ఆయనకు ఇబ్బందికరంగా మారింది. పోలీసులు అనిల్ కుమార్ పై హైకోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు బోరుగడ్డ ఎందుకు సకాలంలో జైల్లో లొంగి పోలేదని ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో బోరుగడ్డ ఇరకాటంలో పడినట్లు అయ్యింది. వాస్తవానికి బోరుగడ్డ లొంగి పోవాల్సింది ముందు రోజు సాయంత్రం. కానీ ఆయన తరువాత రోజు ఉదయం రాజమండ్రి జైలుకు వచ్చి సరెండర్ అయ్యారు. దీంతో రాజమండ్రి జైలు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. బోరుగడ్డకు నోటీసులు జారీ చేసింది.బోరుగడ్డ లొంగిపోవడం వెనుక పెద్ద ఎపిసోడ్ నడిచింది. తన తల్లి అనారోగ్యానికి సంబంధించి సమర్పించిన డాక్టర్ ధృవీకరణ పత్రం ఫేక్ అని పోలీసులు గుర్తించారు. వెంటనే వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారణలో ఉండగానే.. బెయిల్ గడువు ముగిసింది. ఇంతలోనే తనకు బెయిల్ పొడిగించాలని మరోసారి బోరుగడ్డ కోర్టును ఆశ్రయించారు. దీనిపై సైతం కోర్టు విచారణ చేసింది. కానీ పోలీసులు బలమైన ఆధారాలు సమర్పించడంతో బెయిల్ పొడిగించడం కుదరదని తేల్చి చెప్పింది. అంతేకాదు ఎక్కడున్నా సరే.. అత్యవసరంగా వచ్చి అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. దీంతో జైలు అధికారుల ముందు లొంగిపోయారు బోరుగడ్డ. కానీ ఆయనపై పోలీసులు నమోదు చేసిన నకిలీ డాక్టర్ సర్టిఫికేట్ కేసు సహా.. హైకోర్టును తప్పుదోవ పట్టించారన్న కేసులు మాత్రం విచారణలో ఉన్నాయి. తాజాగా వీటిపై విచారణ జరిపిన కోర్టు.. బూరుగడ్డ వంటి వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమని.. ఇలాంటి వారిని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది.ప్రధానంగా తప్పుడు డాక్టర్ సర్టిఫికెట్ సమర్పించి మధ్యంతర బెయిల్ పొందిన వైనంపై విచారణ నివేదికలను సీల్డ్ కవర్లో కోర్టు ముందు ఉంచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. నిర్దేశించిన సమయంలోపు జైలు అధికారుల ముందు ఎందుకు హాజరు కాలేదు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది కోర్టు. దీనిపై ప్రత్యేకంగా పిటిషన్ వేయాలని.. కేసు నమోదు చేయాలని ఆదేశించడం గమనార్హం.

# హీటెక్కుతున్న పాలిటిక్స్...

**హైదరాబాద్, మార్చి 26, పెన్ పవర్:**

తెలంగాణలో అటు బీఆర్ఎస్ ఇటు బీజేపీ మధ్యలో కాంగ్రెస్ ఇలా ప్రధాన పార్టీలు ప్రత్యర్థి పార్టీల నేతలపై వరుస ఫిర్యాదులు చేస్తుండటంతో రాజకీయ వేడి మరింత పెరిగింది. తాజాగా బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్టులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు బీజేపీ నేతలు.. తప్పుడు పోస్టులతో ప్రజలను బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్టులు తప్పుదోవ పట్టిస్తున్నారని.. వారి పోస్టులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది బీజేపీ. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలతో రెండు పార్టీల మధ్య వివాదం తీవ్రమైంది.ఈ వ్యాఖ్యలపై మండిపడుతున్న బీఆర్ఎస్ నాయకులు.. కేసీఆర్‌పై బండి సంజయ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారని ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ స్థాయి మరచి అసత్య ఆరోణలు చేస్తున్నారని మండిపడ్డారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్. దొంగ నోట్ల ప్రెస్‌పై గతంలోనూ కేసీఆర్‌పై ఆరోపణలున్నాయని తాజాగా బండి సంజయ్ వ్యాఖ్యలను మరోసారి సమర్థించారు బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు..అంతకుముందు కేసీఆర్ పై గవర్నర్‌కు గజ్వేల్ కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు .. గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావడం లేదని, ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఫిర్యాదులతో తెలంగాణ పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి.. మొత్తానికి పార్టీల ఫిర్యాదుల పరంపరకు ఎప్పుడు బ్రేక్ పడుతుందో తెలియాలంటే.. వేచి చూడాల్సిందే అంటున్నాయి పొలిటికల్ వర్గాలు..

# గుంటూరు... తర్వాత నెల్లూరు లీడర్స్

**గుంటూరు, మార్చి 26, పెన్ పవర్:** వైసీపీ నేతలపై వరసగా కేసులు నమోదవుతున్నాయి. గత ప్రభుత్వంపై జరిగిన అక్రమాలను బయటకు తీస్తూ ముఖ్యనేతలపై పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. తొలుత రేషన్ బియ్యం కేసులో మచిలీపట్నానికి చెందిన పేర్ని నానితో పాటు అతని కుటుంబ సభ్యులపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయన న్యాయస్థానానికి వెళ్లి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. రేషన్ గోదాములో బియ్యం మాయమయిన ఘటనలో పేర్ని నాని కోటిన్నరకు పైగా ప్రభుత్వానికి చెల్లించడంతో పాటు ఆయన కూడా నిందితుడిగా ఉన్నారు. పేర్ని నాని మచిలీపట్నంలోని తన రైస్ మిల్లులో దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయించారన్న ఆరోపణలపై ఆయనపై కేసు నమోదు చేసింది.. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆయనపై వరసగా కేసులు నమోదవుతున్నాయి. సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేశారన్న కారణంగా ఆయనను అరెస్ట్ చేశారు. దాదాపు నెలరోజులకు పైగానే ఆయన విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వరసగా కేసులు నమోదు అవుతుండటంతో వంశీ ఇప్పట్లో బెయిల్ పై బయటకు వస్తారన్న నమ్మకం కూడా లేదు. అంతకు ముందు బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ను కూడా పలు కేసుల్లో అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అయితే నందిగం సురేష్ మాత్రం కొద్ది రోజుల క్రితం జైలు నుంచి బెయిల్ పై బయటకు వచ్చారు ఇక గత ప్రభుత్వ హయాంలో ఫిలిం ఫెడరేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ గా ఉన్న పోసాని కృష్ణమురళిని అరెస్ట్ చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టారంటూ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలపై కేసు నమోదు చేసిన పోలీసులు పోసానిని గత నెల 21వ తేదీన అరెస్ట్ చేశారు. పోసానిపై పదిహేడు కేసులు నమోదయ్యాయి. కొన్నింటిలో ముందస్తు బెయిల్, మరికొన్నింటిలో షరతులతో కూడిన బెయిల్ తీసుకుని పోసాని రెండు రోజుల క్రితమే జైలు నుంచి బయటకు వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయనపై నమోదయిన కేసులు ఇప్పుడు కోర్టుల్లో నడుస్తున్నాయి. ఇక మాజీ మంత్రి విడదల రజనీపై కూడా తాజాగా ఏసీబీ కేసు నమోదయింది. ఆమె స్టోన్ క్రషర్ యజమాని నుంచి 2.26 కోట్ల రూపాయలు వసూలు చేశారంటూ ఫిర్యాదు అందడంతో రజనీతో పాటు మరికొందరిపై కేసు నమోదయింది. ఎప్పుడైనా విచారణకు పిలిచి అరెస్ట్ చేసే అవకాశాలున్నాయంటున్నారు. తాజాగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై కేసు నమోదు అయింది. కోట్ల విలువైన క్వార్జ్ దోపిడీ చేశారని ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పొదలకూరు మండలం తాటిపర్తిలోని రుస్తుం మైన్స్‌లో లీజు సమయం ముగిసినా క్వార్జ్ తరలించారని ఆరోపణల నేపథ్యంలో కేసు నమోదయింది. గనుల శాఖ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ4గా కాకాణి గోవర్ధన్‌రెడ్డి 120బీ, 447, 427, 379, 220, 506, 129తో పాటు ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టెన్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఇక నెల్లూరు నుంచి చిత్తూరు వెళ్లడమే తరువాయి అంటున్నారు. అక్కడ ఇప్పటికే కీలక నేతలపై మద్యంతోపాటు పలు కేసులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మొత్తం మీద వరస కేసులతో వైసీపీ నేతల్లో దడ మొదలయిందనే చెప్పాలి. ఎప్పుడు ఎవరు అరెస్ట్ అవుతారన్న ఉత్కంఠ నెలకొంది.

# నాగబాబు పదవికి బ్రేక్....



**విజయవాడ మార్చి 26, పెన్ పవర్:** జనసేన నేత నాగబాబు మంత్రిపదవికి బ్రేకులు పడినట్లు పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. కొద్దికాలం క్రితం పార్టీ పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని చెప్పారు. ఉగాది రోజున ఆయన మంత్రివర్గంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్న వార్తలు కూడా వచ్చాయి. కానీ అలాంటి వాతావరణం కనిపించకపోవడం ఇప్పుడు పార్టీలోనూ, జనసైనికుల్లోనూ చర్చనీయాంశమైంది. ఉగాదికి ఇంకా వారం రోజులు కూడా సమయం లేదు. దీనికి సంబంధించిన అప్ డేట్ ఇంత వరకూ రాకపోవడంతో కొంత జనసైనికుల్లో ఆందోళన నెలకొంది. దీనిపై అధికారిక పర్యటన ఇటీవల కాలంలో కూడా రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. నాగబాబును తొలుత రాజ్యసభకు ఎంపిక చేయాలని భావించినా ఆ ఆలోచనను మానుకుని మంత్రివర్గంలోకి తీసుకుందామని పవన్ కల్యాణ్ డిసైడ్ అయ్యారు. తన సోదరుడు పార్టీకోసం పడిన కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇవ్వాలన్నది ఆయన నిర్ణయం. ఇందులో కుటుంబం, వారసత్వం, కులం వంటివి లేవని, కేవలం పనిచేసిన వారందరికీ వరసగా ప్రాధాన్యత ఇస్తామని చెబుతూ వస్తున్నారు. కానీ పిఠాపురంలో జరిగిన జనసేన ఆవిర్భావ వేడుకల తర్వాత కొంత మారినట్లు కనిపిస్తుంది. ఇద్దరం మంత్రివర్గంలో ఉండే కంటే నాగబాబుకు పార్టీ బాధ్యతలను అప్పగించి జిల్లాల పర్యటనలు చేయించాలన్న ఆలోచనలో పవన్ కల్యాణ్ ఉన్నట్లు చెబుతున్నారు. . తనకు తరచూ ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండటంతో పార్టీపై ఫోకస్ పెట్టాలంటే నాగబాబు మంత్రిపదవి లో కంటే పార్టీలో కీలకంగా ఉంటేనే మంచిదన్న భావనలో పవన్ కల్యాణ్ ఉన్నారని చెబుతున్నారు. అందుకే నాగబాబుకు ఈ విషయం చెప్పినట్లు కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. జిల్లాలు తిరుగుతూ పార్టీని బలోపేతం చేయాలని నాగబాబుకు పవన్ కల్యాణ్ సూచించినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ కేబినెట్ లో ఒకటే ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. అందులోనూ నాగబాబు చేరిపోతే ఇక పార్టీని పట్టించుకునే వారు లేరు. నాదెండ్ల కూడా కేబినెట్ లో ఉండటం కూడా ఇందుకు కారణం. మరొకవైపు ఉగాది రోజున చంద్రబాబు ప్రతిష్టాత్మకైన పీ4 పథకం ప్రారంభించేందుకు అట్టహాసంగా పనులు మొదలు పెట్టడంతో ఇక నాగబాబుకు అమాత్య పదవి లేనట్లేనన్న కామెంట్స్ మాత్రం ఎక్కువగా వినిపిస్తున్నాయి.

**జనసైనికుల్లో నిరాశలు**

కూటమి ప్రభుత్వ హయాంలో జనసైనికులు అవమానాలు ఎదుర్కొంటున్నారా..?

పార్టీకోసం పనిచేస్తున్న నిఖార్సయిన కార్యకర్తల్ని జనసేన పట్టించుకోవడంలేదా..?

అధినేత సైలెంట్ గా ఉండటాన్ని జనసైనికులు జీర్ణించుకోలేకపోతున్నారా..?

ప్రస్తుతం సోషల్ మీడియాలో జనసైనికుల ట్వీట్లు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తోంది. తాజాగా సాయిబాబా అనే జనసైనికుడి ట్విట్టర్ అకౌంట్ లో పోస్ట్ చేసిన ఓ లేఖ వైరల్ గా మారింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ని ఉద్దేశించి సాయిబాబా లేఖ రాశారు. తనలాగే పార్టీలో చాలామంది కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారని సాయిబాబా వివరించారు. మరి ట్విట్టర్లో జనసైనికుడి ఆవేదన జనసేనాని వరకు చేరుతుందో లేదో చూడాలి. అన్న ఎంతో బాధ తో జనసేన పార్టీ పట్ల ప్రేమ తో నా చివరి ప్రయత్నం గా నేను చెప్పాలి అనుకున్నది ఈ లెటర్ లో రాసాను అది మీరు చదివి తగు చెర్యలు చెపడతారు అని ఆశిస్తున్నాను ????.

బరువెక్కిన గుండెలతో పార్టీ కి మరియు ఈ ట్విట్టర్ కి స్వస్తి ????

ఎవర్ని అయినా నా ఈ ప్రయాణం లో బాధించి?

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. కూటమి అంటే ఇక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ అని చెప్పుకోవాలి. కానీ క్షేత్ర స్థాయిలో కూటమి అంటే టీడీపీ ప్రభుత్వం మాత్రమే అనే అర్థం ఉందని ముఖ్యంగా జనసైనికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు జనసేన అధికార పార్టీనా, ప్రతిపక్షమా అనేది అర్థం కావడంలేదని అంటున్నారు. ఎన్నికలకు ముందు ఎన్నో అవమానాలు భరించామని, ఎన్నికల తర్వాత కూటమి అధికారంలోకి వచ్చాక కూడా జనసైనికుల తలరాత మారలేదని వారు ఆరోపిస్తున్నారు. అసలు జనసేన ఎదుగుదలను పవన్ కల్యాణ్ పట్టించుకుంటున్నారో లేదో అనే అనుమానం వస్తోందని తన లేఖలో ప్రస్తావించారు సాయిబాబా అనే జనసైనికుడు. ఇటీవల తిరువూరు నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ ను వివరణ కోరుతూ జనసేన ఒక బహిరంగ నోటీసు ఇచ్చింది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో తనకు ప్రాణహాని ఉందని మీడియాతో చెప్పినందుకు వివరణ కోరింది. అలాంటి వ్యవహారం ఏదైనా ఉంటే ముందు పార్టీ దృష్టికి తీసుకురావాలి కానీ, మీడియాకెక్కడం మంచిది కాదని సూచించారు నేతలు. అదే సమయంలో 48 గంటల్లోగా ఎక్స్ ప్లెనేషన్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను కూడా సాయిబాబా పరోక్షంగా తన లేఖలో ప్రస్తావించారు. అసలు జరిగిందేంటో తెలుసుకోవాలనే ఆలోచన ఉంటే.. సదరు తిరువూరు ఇన్ చార్జ్ ని పిలిపించి మాట్లాడేవారని, కానీ బహిరంగంగా నోటీసులివ్వడం ద్వారా ఆయన్ని చులకన చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా జనసేన కార్యకర్తల అరెస్ట్ లు ఆగలేదని, అయినా కూడా పార్టీ పట్టించుకోవడంలేదని అంటున్నారు సాయిబాబా. ప్రభుత్వం కేసులు పెట్టినా తమకు పెద్దగా బాధలేదని, అయితే పార్టీ ఆఫీస్ పట్టించుకోకపోవడం అత్యంత దారుణం అని అన్నారు. వైసీపీ వాళ్లు ఎన్ని విమర్శలు చేసినా జనసేన పార్టీ అధికారికంగా ఖండించడం లేదని ఆయన వాపోయారు. అదే సమయంలో కొంతమంది టీడీపీ వాళ్లు కూడా వైసీపీ వారితో చేరి పవన్ కల్యాణ్ పై లేనిపోని ఫేక్ ప్రచారం చేస్తున్నారని అన్నారాయన. తాను జనసేనకు, ట్విట్టర్ కి కూడా గుడ్ బై చెప్పేస్తున్నాని అన్నారు సాయిబాబా. పార్టీని కార్యకర్తలు పట్టించుకున్నంతగా, పార్టీ కార్యకర్తల్ని పట్టించుకోవట్లేదని తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు సాయిబాబా. పార్టీ బాగుంటే సరిపోదని, పార్టీలోని కార్యకర్తలు కూడా బాగుండాలని ఆయన సూచించారు. ఇన్నాళ్లూ పార్టీకోసం సిన్సియర్ గా కష్టపడ్డామని, ఆత్మాభిమానం చంపుకొని ఉండాలంటే తమ వల్ల కావడం లేదని అన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక్కసారయినా పవన్ కల్యాణ్ పార్టీ నాయకులతో, కార్యకర్తలతో మీటింగ్ పెట్టారా అని ప్రశ్నించారు. ఇకనైనా ఆ పని చేయాలని, వారిలోని అసంతృప్తి ఏంటో తెలుసుకోవాలని సూచించారు. సాయిబాబా అనే ట్విట్టర్ అకౌంట్ నుంచి పోస్ట్ అయిన ఈ లెటర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. చాలామంది ఈ లెటర్ పై సానుకూలంగా స్పందిస్తున్నారు. జనసేనలో ప్రస్తుతం ఇదే పరిస్థితి ఉందని, అధిష్టానం కాస్త దృష్టిపెట్టాలని వారు సూచిస్తున్నారు.

# తమ్ముళ్ల వాయిస్ ఏదీ

**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** లుగుదేశం పార్టీలో సీనియర్ నేతలు యాక్టివ్ గా లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. అధికారంలో లేనప్పుడే నయం. అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తిన సీనియర్ నేతలు గత ఎన్నికల్లో టిక్కెట్లు రాక కొందరు, మంత్రి పదవులు దక్కక మరికొందరు మూగవోయారు. అందరూ జూనియర్ నేతలు కావడంతో ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలకు సరిగా కౌంటర్ ఇవ్వలేకపోతున్నారు. కొందరు తమకేం పట్టిందని వ్యవహరిస్తుండగా, మరికొందరు ఏం మాట్లాడితే ఏం జరుగుతందోనన్న భయంతో జూనియర్ నేతలు గళం విప్పడం లేదు. దీంతో టీడీపీ నేతల నుంచి గట్టి కౌంటర్ ఇవ్వడం లేదన్న విమర్శలు ఆ పార్టీ క్యాడర్ నుంచే వినిపిస్తుండటం విశేషం. రాజకీయాల్లో అనుభవం చాలా ముఖ్యం. ఎవరికి ఏ రకమైన సమాధానం చెప్పాలన్నది డక్కీమొక్కీలు తిన్న నేతలకు మాత్రమే తెలుస్తుంది. కొత్తగా తొలిసారి ఎన్నికయిన వారిలో కొందరు మినహాయించి మిగిలిన వారిలో పార్టీ తరుపున కౌంటర్ ఇవ్వాలన్న స్పృహ కూడా లేదని టీడీపీ సోషల్ మీడియాలో సొంత క్యాడర్ నుంచి విమర్శలువినిపిస్తున్నాయి. ఉండటానికి ఇరవై మందికిపైగా మంత్రులున్నప్పటికీ ఘాటుగా రిప్లై ఇచ్చేవారు ఒకరిద్దరు మినహాయించి ఎవరూ మాట్లాడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు చిలకలూరిపేటమాజీ

ఎమ్మెల్యే విడదల రజనీపై కేసు నమోదు చేసిన సంఘటనపై ఆమె అనేక ఆరోపణలు చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగమని, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుపై కూడా విమర్శలు చేశారు కానీ టీడీపీ నుంచి ఒక్క మంత్రి కూడా దీనిపై స్పందించలేదు. రజనీ చేసిన తప్పులను ఎండగట్టే ప్రయత్నం చేయలేదు. చివరకు ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు నేరుగా రంగంలోకి దిగి తాను కౌంటర్ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్తిపాటి పుల్లారావు స్పందించినప్పటికీ దానికి అంతగా ప్రాచుర్యం లభించలేదు. మంత్రులు ఇంత మంది ఉండి ఏం చేస్తున్నారన్న ప్రశ్నను తెలుగు తమ్ముళ్లు లేవనెత్తుతున్నారు. ఏసీబీ కేసు నమోదు చేయడంతో పాటు ఐపీఎస్ అధికారి చేసిన ఫిర్యాదు ఉన్నప్పటికీ ధీటుగా బదులివ్వలేని పరిస్థితి అమాత్యులకు ఎందుకు ఉందని నిలదీస్తున్నారు. ఇలాగే కొనసాగితే ప్రతిపక్ష విమర్శలను ప్రజలు నమ్మే అవకాశముందన్న హెచ్చరికలు కూడా వినిపిస్తున్నాయి... దీంతో పాటు వైసీపీ నేతలు సూపర్ సిక్స్ పై విపరీతమైన నెగిటివ్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఒక్కొక్కటిగా అమలు చేస్తామని చంద్రబాబు చెబుతున్నప్పటికీ ఆ విషయాన్ని ప్రజల్లో చేరవేయడంలో మంత్రులు ఎవరూ సక్సెస్ కాలేదంటున్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందిపడిన విషయంపై వెంటనే చంద్రబాబు రియాక్ట్ అయ్యారు. ఆదుకుంటామని చెప్పారు. కానీ మంత్రులు ఎవరూ దీనిపై పెద్దగా స్పందించకపోవడం కూడా తమ్ముళ్ల ఆగ్రహానికి కారణమయింది. ప్రజల్లో వ్యతిరేకత ప్రబలే విధంగా, వైసీపీ అధినేత జగన్ కు హైప్ లభించేలా ప్రచారం జరుగుతున్నా దానిని పట్టించుకోకుండా అత్యధిక శాతం మంత్రులు మౌనంగా ఉండటాన్ని తప్పుపడుతున్నారు. ఒకరిద్దరు మంత్రులు మినహాయించి ఎవరూ యాక్టివ్ గా లేకపోవడం పార్టీలోనే విమర్శలకు తావిస్తుంది. చంద్రబాబు మరోసారి కేబినెట్ సమావేశంలో క్లాస్ పీకాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుగు తమ్ముళ్లు

# స్మార్ట్ మీటర్ స్కాం...

**ఏలూరు, మార్చి 25, పెన్ పవర్:** కర్ణాటక ప్రభుత్వ విద్యుత్ శాఖలో భారీ కుంభకోణం చోటు చేసుకుందా? అంటే తాజాగా బీజేపీ ఆరోపణలను పరిగణలోకి తీసుకుంటే అవుననే అనిపిస్తోంది. అదటుంచి ఈ కుంభకోణం తీరును గమనిస్తే.. గతంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ నేతృత్వలోంని వైసీపీ ప్రభుత్వం ఎలాగైతే స్మార్ట్ మీటర్ల పేరిట భారీ స్కామ్ చేసిందని అప్పటి ప్రతి పక్షం టీడీపీ ఆరోపించిందో.. ఇప్పుడు కర్ణాటకలోనూ అలాగే జరుగుతోంది. కర్ణాటకలో స్మార్ట్ మీటర్ కొనుగోలులో ఏకంగా ?7,500 కోట్ల స్కాం జరిగిందని ప్రతిపక్షం బీజేపీ ఆరోపించింది. సదరు టెండర్‌ను తయారీదారులకు కాకుండా సరఫరాదారులకు కేటాయించడం వల్ల స్మార్ట్ మీటర్ల ధరలు భారీగా పెంచారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాదు, సాఫ్ట్‌వేర్ మద్దతునిచ్చే సంస్థ ఇప్పటికే బ్లాక్‌లిస్ట్ అయిన కంపెనీ అని విమర్శలు వచ్చాయి. ఇతర రాష్ట్రాలతో పోల్చితే కర్ణాటకలో స్మార్ట్ మీటర్ ధరలు భారీగా పెరిగాయి. ఏషియానేట్ న్యూస్‌కు లభించిన డాక్యుమెంట్ల ప్రకారం, సింగిల్ ఫేజ్ మీటర్ ధర ?950 నుంచి ?4,998కి పెరిగింది. మరో రకమైన సింగిల్ ఫేజ్ మీటర్ ధర ?2,400 నుంచి ?9,000కి పెరిగింది. త్రిఫేజ్ మీటర్ ధర అయితే ఏకంగా ?2,500 నుంచి ?28,000కి పెరిగింది. గతంలో ఏపీలోనూ ఇలాంటి ఆరోపణలే వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ లో రూ.ఏడు వేలు మీటరును రూ.36 వేలు విక్రయించారని ఆరోపణలు వచ్చాయి. గతంలో టీడీపీ నేత.. సోమిరెడ్డి పేర్కొన్న వివరాల ప్రకారం.. ఇతర రాష్ట్రాలు ఒక్కో స్మార్ట్ మీటర్‌ను రూ.4 వేలకు కొంటుంటే వైసీపీ ప్రభుత్వం రూ.36 వేల కు కొనుగోలు చేసింది ఈ స్మార్ట్ మీటర్ల కొనుగోలులో రూ.17 వేల కోట్ల అక్రమాలు జరిగాయి. ఈ భారాన్ని అప్పటి ప్రభుత్వం కరెంటు బిల్లుల్లో వేసి వసూలు చేయాలని నిర్ణయించింది. పొలాల్లో వ్యవసాయ బావులకు వాడుతున్న మోటార్లకు కూడా స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, మోటార్లకన్నా మీటర్ల ధర రెట్టింపు ఉందని అన్నారు. 'రాజస్థాన్‌లో స్మార్ట్ మీటర్ ధర, నిర్వహణ కలిపి రూ.7900 కోట్ చేశారు. ఛండీగఢ్ ప్రభుత్వ కంపెనీ రూ.7100 కోట్ చేసింది. మన రాష్ట్రంలో మాత్రం స్మార్ట్ మీటర్ ధర, నిర్వహణ కలిపి ఏకంగా రూ.36,975కు టెండర్ ఖరారు చేశారు. అని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్‌కు ?900 సబ్సిడీ ఇస్తోంది. ఇతర రాష్ట్రాల్లో ఈ మొత్తాన్ని టెండర్ కంపెనీలకు మంజూరు చేసి, ప్రజలపై భారం తగ్గించగా, కర్ణాటక ప్రభుత్వం మాత్రం మొత్తం డబ్బును టెండర్ సంస్థలకు చెల్లించడంతోపాటు వినియోగదారుల నుంచి కూడా అధిక వసూళ్లు చేపట్టింది. ఒక్కో మీటర్‌పై ?9,260 అదనంగా ఖర్చు అవుతోందని ఏషియానేట్ ప్రత్యేక నివేదిక వెల్లడించింది. బెస్కాం, మెస్కాం, హెస్కాం, జెస్కాం, సెస్కాం కలిసి మొత్తం 8 లక్షల స్మార్ట్ మీటర్ల కోసం ?7,408 కోట్ల అదనపు వ్యయం అయింది. ఈ భారీ మొత్తాన్ని ఎవరికి లాభంగా మళ్లించారు? ఏ కారణంతో స్మార్ట్ మీటర్ల ధరలు భారీగా పెంచారు? టెండర్‌లో జరిగిన గోల్‌మాల్‌కు ఎవరు బాధ్యత వహించాలి? ఈ ప్రశ్నలు సంధిస్తూ హౌస్ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని ప్రతి పక్షం బీజేపీ డిమాండ్ చేస్తోంది.

# అనంతలో అద్భుతం

**అనంతపురం, మార్చి 26, పెన్ పవర్:** గ్రామాల్లో తరచుగా వింతలు జరుగుతుంటాయి. కలలోకి దేవతలు వచ్చారని, ఫలానా పని చేయాలని కొందరు చెప్తూ ఉంటారు. కొన్నిసార్లు వాళ్లు చెప్పినట్లు చేస్తే ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వస్తాయి. తాజాగా ఏపీలో ఇలాంటి ఘటనే జరిగింది. ఓ యువకుడి కలలోకి అమ్మవారు వచ్చి.. ఫలానా చోట తవ్వితే తన విగ్రహం బయటపడుతుందని చెప్పిందట. గ్రామస్తులంతా కలిసి అమ్మవారు చెప్పిన చోటుకు వెళ్లి గునపాలతో తవ్వారు. ఆశ్చర్యకరంగా అమ్మవారి విగ్రహం బయటపడింది. దీంతో గ్రామస్తులంతా ఆ విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేయడం మొదలు పెట్టారు. ఇంతకీ అసలు ఏం జరిగిందటే.. అనంతపురానికి చెందిన అంజి అనే యువకుడు గత కొద్ది రోజులుగా అమ్మవారు ఒంటి మీదికి వచ్చిందంటూ పూనకంతో ఊగిపోతున్నాడు. అంతేకాదు, గంగమ్మ అమ్మవారు తన కలలోకి వచ్చిందని చెప్పాడు. గౌరవ గార్డెన్ వాటర్ ట్యాంక్ సమీపంలో తవ్వితే విగ్రహాలు బయటపడతాయని చెప్పిందంటూ శిగం ఊగాడు. రెండు అడుగుల లోతుతో ఆ విగ్రహాలు ఉన్నాయని అమ్మవారు తనకు చెప్పిందని చుట్టుపక్కల వారితో చెప్పాడు. అతడి మాటలు నమ్మిన స్థానికులు వాటర్ ట్యాంక్ సమీపంలో తవ్వకాలు చేపట్టాలి అనుకున్నారు. తాజాగా స్థానికుల అంతా కలిసి పూజలు చేసి అంజి చెప్పిన ప్రాంతంలో పూజలు చేసి, విగ్రహాల కోసం తవ్వకాలు మొదలుపెట్టారు. చెప్పినట్లుగానే రెండు అడుగులు తవ్వగానే గంగమ్మ అమ్మవారి విగ్రహం బయటపడింది. స్థానికులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. అందరూ కలిసి అమ్మవారి విగ్రహాన్ని నీటితో కడిగి, పసుపు, కుంకుమ రాశారు. పూలు, నిమ్మకాయలు పెట్టి పూజలు చేస్తున్నారు. ఈ విషయం అనంతపురం అంతా వ్యాపించడంతో అమ్మవారిని చూసేందుకు ప్రజలు తరలి వస్తున్నారు. అమ్మవారిని చూసి విగ్రహం మీద పసుపు, కుంకుమ వేసి పూజలు చేస్తున్నారు. అందరినీ చల్లగా చూడాలని కోరుకుంటున్నారు. విగ్రహాలు బయటప పడటంతో అంజి చెప్పిన మాటలు నిజమేనని అందరూ భావిస్తున్నారు. ఆయనకు గంగమ్మ అమ్మవారు ఒంటి మీదికి వస్తున్నట్లు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటన అనంతపురంలో హాట్ టాపిక్ గా మారింది. మరోవైపు ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు స్థానికులు అంతా కలిసి అమ్మవారికి ఆలయం కట్టించాలని నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు మొదలు పెడతామని చెప్తున్నారు. ఈ ఆలయంలో అంజినే పూజారిగా ఉంచాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఆయన మూలంగానే అమ్మవారు బయటకు వచ్చారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్తున్నారు.

# స్వరూపానందకు వారం రోజులు గడువు

**విశాఖపట్టణం, మార్చి 26, పెన్ పవర్:**

విశాఖ శ్రీ శారదా పీఠం వ్యవహారం ఎంతవరకు వచ్చింది? కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్వరూపానంద స్వామి కనిపించడం మానేశారా? స్వామి కబ్జాల వ్యవహారం బయటకు వస్తోందా? బయటకు రావడం కంటే సైలెంట్‌గా ఉండడమే బెటరని అంచనాకు వచ్చారా? మరి జీవీఎంసీ నోటీసులకు స్పందన లేకుంటే కూల్చివేతలు ఖాయమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ రూలింగ్‌లో రాజభోగం అనుభవించిన వారిలో శ్రీ శారదా పీఠం స్వరూపానంద స్వామి ఒకరు. భక్తుల మాట కాసేపు పక్కనబెడితే ఆయన ఆశీర్వాదం కోసం రాజకీయ నేతలు, అధికారులు తెగ తిరిగేవారు. అయినా స్వామి జగన్, కొందరు మంత్రులకు మాత్రమే కనిపించేవారు. ఆ తర్వాత ప్రత్యేకంగా కొందరితో మాత్రమే మాట్లాడేవారు. వైసీపీ పాలనలో వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను ఆక్రమించుకున్నారని స్వామిపై ఆరోపణలు లేకపోలేదు. దీనికితోడు స్వామికి ప్రత్యేకంగా భద్రత సైతం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు బాగా పరిపాలన చేస్తారంటూ రెండు ముక్కలు మాట్లాడారు. ధనుర్మాసం పూజలంటూ బయటకు వెళ్తానన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో సెటిలవుతానని చెప్పుకొచ్చారు. చివరకు స్వామి పత్తా లేకుండా పోయారు. ఇప్పుడు ఎక్కడ ఉన్నారో తెలీదు. స్వామి కోసం చాలామంది భక్తులు ఎదురు చూస్తున్నారు. స్వామి ఆశీర్వాదం తీసుకుంటే మంచి జరుగుతుందని కొందరు నమ్ముతారు. కూటమి వచ్చాక ఆయన భద్రతను పూర్తిగా తొలగించింది. ఇప్పుడు స్వామి కూడబెట్టిన ఆస్తులపై దృష్టిపెట్టింది. తాజాగా విశాఖ శ్రీ శారదా పీఠానికి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ నోటీసులు ఇచ్చారు. రెవెన్యూ అధికారుల సర్వేలో 22 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు గుర్తించారు. అందులో శాశ్వత కట్టడాలు నిర్మించారు. వాటిని వారంలోగా తొలగించాలని నోటీసులో ప్రస్తావించారు అధికారులు. లేకుంటే తామే కూల్చివేస్తామని మఠం మేనేజర్‌కి వాటిని అందజేశారు. తొలగింపుకు అయ్యే ఖర్చు శారదాపీఠం నుంచే వసూలు చేస్తామన్నారు. చిన ముషిడివాడలో శ్రీశారదా పీఠం ఉంది. అందులో దాదాపు 22 సెంట్ల భూమి ప్రభుత్వ స్థలం ఉంది. అందులో 203 చదరపు గజాల స్వయం జ్యోతి మండపం ఉంది. 13 గజాల స్థలం సర్వే సంఖ్య 90లో ఉంది. మిగిలిన స్థలం సర్వే సంఖ్య 91/9లో వుడా లేఅవుట్‌కి సంబంధించిన ఓపెన్ స్పేస్‌లో ఉంది. 190 చదరపు గజాల ప్రాంతంలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, వుడాకి సంబంధించి ఓపెన్ స్పేస్ ఉంది. ఓవరాల్‌గా చూస్తే శారదా పీఠంలో 9 శాశ్వత కట్టడాలు ఉన్నాయి. అందులో కొంత ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వం నోటీసులపై స్వామి నుంచి ఎలాంటి రియాక్షన్ లేదు. రేపో మాపో స్వరూపానందకు సంబంధించి ఇంకెన్ని కొత్త విషయాలు బయటకు వస్తాయో చూడాలి.

# ఐపీఎల్‌లో రషీద్ ఖాన్ అరుదైన ఘనత.. జస్ప్రీత్ బుమ్రాను అధిగమించిన స్పిన్నర్!

- అత్యంత వేగంగా 150 వికెట్ల ఫీట్ అందుకున్న బౌలర్ల జాబితాలో రషీద్ మూడో స్థానం
- కేవలం 122 మ్యాచ్‌ల్లో 150 వికెట్లు పడగొట్టిన స్పిన్నర్
- 124 మ్యాచ్‌ల్లో ఈ మైలురాయిని చేరుకున్న బుమ్రా
- ఈ జాబితాలో తొలి రెండు స్థానాల్లో మలింగ (105), చాహల్ (118)



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో గుజరాత్ టైటాన్స్ (జీటీ)కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆఫ్ఘనిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అరుదైన ఘనత సాధించాడు. అత్యంత వేగంగా 150 వికెట్ల మైలురాయిని చేరుకున్న బౌలర్ల జాబితాలో మూడో స్థానంలో నిలిచాడు. పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్)తో నిన్న రాత్రి జరిగిన జీటీ సీజన్ ఓపెనర్ మ్యాచ్‌లో రషీద్ ఈ ఘనత సాధించాడు. అతడు కేవలం 122 మ్యాచ్‌ల్లో 150 వికెట్లు పడగొట్టడం విశేషం. ముంబయి ఇండియన్స్ (ఎంఐ) బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను అధిగమించి రషీద్ ఈ మైలురాయిని అందుకున్నాడు. బుమ్రా 124 మ్యాచ్‌ల్లో ఈ ఘనత సాధించాడు. కాగా, ఈ జాబితాలో తొలి రెండు స్థానాల్లో లసిత్ మలింగ (105), యుజ్వేంద్ర చాహల్ (118) ఉన్నారు. కాగా, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల లిస్టులో 205 వికెట్లతో చాహల్ అగ్రస్థానంలో ఉంటే... రషీద్ 11వ స్థానంలో కొనసాగుతున్నాడు.

ఇక మంగళవారం రాత్రి జరిగిన ఐపీఎల్ 5వ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ (జీటీ)ను పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) 11 పరుగుల తేడాతో మట్టికరిపించిన విషయం తెలిసిందే. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ 243 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (97 నాటౌట్) భారీ ఇన్నింగ్‌కు తోడు ఇతర బ్యాటర్లు కూడా రాణించడంతో గుజరాత్ భారీ స్కోర్ నమోదు చేసింది. ఆ తర్వాత 244 పరుగుల లక్ష్య ఛేదనతో బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ 232 పరుగులే చేయగలిగింది.

# ప్రయోగాలు చేసి పరువు పోగొట్టుకున్నారు: న్యూజిలాండ్ 'బి' జట్టుతో చిత్తుగా సిరీస్ ఓడిన పాకిస్థాన్




**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్త కుర్రాళ్లతో టీ20 సిరీస్ కోసం న్యూజిలాండ్ లో అడుగుపెట్టిన పాకిస్థాన్ జట్టుకు ఘోర పరాభావం మిగిలింది. 5 టీ20 మ్యాచ్ ల టీ20 సిరీస్ కు 1-4 తేడాతో కోల్పోయింది. బుధవారం (మార్చి 26) సిరీస్ లో భాగంగా చివరిదైన ఐదో టీ20లో పాకిస్థాన్ పై న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి రెండు టీ20 మ్యాచ్ ల్లో కివీస్ గెలవగా.. మూడో టీ20లో పాకిస్థాన్ గెలిచింది. నాలుగు, ఐదు టీ 20ల్లో న్యూజిలాండ్ గెలిచి 4-1 తేడాతో సిరీస్ ను దిగ్విజయంగా ముగించింది. స్టార్ బ్యాటర్లు మహమ్మద్ రిజ్వాన్, బాబర్ అజామ్ లేకుండా సిరీస్ ఆడిన పాకిస్థాన్ కు ఘోర పరాభవం తప్పలేదు.

నేడు జరిగిన ఐదో టీ20లో పాకిస్థాన్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఘోరంగా విఫలమైంది. మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలలో 9 వికెట్ల నష్టానికి కేవలం 128 పరుగులు చేసింది. కెప్టెన్ సల్మాన్ అఘా ఒక్కడే 51 పరుగులు చేసి రాణించాడు. షాదాబ్ ఖాన్ 28 పరుగులు చేసి పర్వాలేదనిపించగా.. మిగిలిన వారు ఘోరంగా విఫలమయ్యారు. ఒక దశలో 52 పరుగులకే పాకిస్థాన్ సగం జట్టుకు కోల్పోయింది. సల్మాన్ బ్యాటింగ్ తో పాక్ ఆ మాత్రం స్కోర్ అయినా చేయగలిగింది. 129 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ ఆడుతూ పాడుతూ ఛేజ్ చేసింది. పాక్ బౌలర్లను చితక్కొడుతూ కేవలం 10 ఓవర్లలోనే టార్గెట్ ఛేజ్ చేసింది. ఈ సిరీస్ లో అద్భుత ఫామ్ లో ఉన్న ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ 38 బంతుల్లోనే 97 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్ లో 6 ఫోర్లతో పాటు ఏకంగా 10 సిక్సర్లు ఉన్నాయి. ఇన్నింగ్స్ పదో ఓవర్ లో షాదాబ్ ఖాన్ బౌలింగ్ లో నాలుగు సిక్సర్లు కొట్టి మ్యాచ్ ను ఫినిష్ చేశాడు. సీఫెర్ట్ తో పాటు అలెన్ (27) కూడా రాణించడంతో పాకిస్థాన్ పవర్ ప్లే లో 92 పరుగులు రాబట్టుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ 5 వికెట్లు తీసిన నీషం కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ టిమ్ సీఫెర్ట్ గెలుచుకున్నారు.

# ఆసీస్ స్టార్‌పై విమర్శలు: అయ్యర్ రూపంలో మ్యాక్ వెల్‌కు బ్యాడ్‌లక్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్ వెల్ పై ప్రస్తుతం విమర్శల వర్షం కురుస్తుంది. ఐపీఎల్ కు పనికిరాడంటూ నెటిజన్స్ ఈ ఆసీస్ స్టార్ పై మండిపడుతున్నారు. మంగళవారం (మార్చి 25) గుజరాత్ టైటాన్స్ పై తొలి బంతికే ఔట్ కావడమే ఇందుకు కారణం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున గత సీజన్ లో ఘోరంగా విఫలమైన మ్యాక్స్ వెల్ ఈ సీజన్ లోనూ అదే పేలవ ఫామ్ ను కొనసాగిస్తున్నాడు. అయితే మ్యాక్స్ వెల్ ఔట్ కు పంజాబ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ కూడా ఒక కారణమని తెలుస్తుంది. సాయి కిషోర్ వేసిన ఇన్నింగ్స్ 11 ఓవర్ నాలుగో బంతిని మ్యాక్స్ వెల్ రివర్స్ స్వీప్ ఆడాడు. గుజరాత్ అప్పీల్ చేయడంతో అంపైర్ ఔటిచ్చాడు. ఈ దశలో మ్యాక్ వెల్ రివ్యూ తీసుకోవడానికి అయ్యర్ సలహా అడిగాడు. అయితే అయ్యర్ మాత్రం రివ్యూ తీసుకో అని చెప్పలేదు. ఔట్ అన్నట్టుగా సైగ చేశాడు. దీంతో ఈ ఆసీస్ స్టార్ పెవిలియన్ కు చేరాడు. ఆ తర్వాత రీప్లేలో బంతి వికెట్లను మిస్ అవుతున్నట్టు చూపించింది. మ్యాక్ వెల్ రివ్యూ తీసుకొని ఉంటే నాటౌట్ అయ్యేవాడు. కానీ అయ్యర్ సలహాతో ఔట్ అవ్వాల్సి వచ్చింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున గత సీజన్ లో ఒక్క మెరుపు ఇన్నింగ్స్ కూడా లేకపోగా ప్రతి ఇన్నింగ్స్ లో ఘోరంగా విఫలమయ్యాడు. అయితే 2025 ఐపీఎల్ మెగా ఆక్షన్ లో పంజాబ్ అతన్ని నమ్మి రూ. 4.2 కోట్లకు తీసుకుంటే తొలి మ్యాచ్ లోనే డకౌటయ్యాడు. ఆడిన తొలి బంతికే సాయి కిషోర్ ఫ్యాన్స్ రివర్స్ స్వీప్ ఆడి ఎల్బీడబ్ల్యూ రూపంలో వికెట్ సమర్పించుకున్నాడు. మ్యాక్స్ వెల్ ఇదే ప్రదర్శన కొనసాగితే అతను తుది జట్టులో చోటు సంపాదించుకోవడం కూడా కష్టంగా కనిపిస్తుంది. ఐపీఎల్ 2024 సీజన్ లో బెంగళూరు తరపున అట్టర్ ఫ్లాప్ షో చేశాడు. మొత్తం 9 ఇన్నింగ్స్ ల్లో 52 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. శ్రేయస్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో సత్తా చాటడంతో మెగా లీగ్‌ను పంజాబ్ కింగ్స్ అదిరిపోయే విజయంతో ఆరంభించింది. మంగళవారం జరిగిన హై స్కోరింగ్ మ్యాచ్‌లో 11 రన్స్ తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. తొలుత శ్రేయస్ మెరుపులతో పంజాబ్ 20 ఓవర్లలో 243/5 స్కోరు చేసింది. శ్రేయస్ అయ్యర్ (42 బాల్స్‌లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో 97 నాటౌట్) తొలి మ్యాచ్‌లోనే హిట్టయ్యాడు. ఛేజింగ్‌లో సాయి సుదర్శన్ (41 బాల్స్‌లో 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 74), జోస్ బట్లర్ (33 బాల్స్‌లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 54) ఫిఫ్టీలతో రాణించినా జీటీ 20 ఓవర్లలో 232/5 స్కోరు చేసి పోరాడి ఓడింది.

# మెగా అల్లుడ్ని ఎవరూ మెప్పించలేకపోతున్నారా?



వైష్ణవి చైతన్య సంప్రదాయ చీరలో అందంగా కనిపిస్తోంది



మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ నుంచి సినిమా రిలీజ్ అయి ఏడాది దాటింది. 'ఆదికేశవ' తర్వాత ఇంత వరకూ కొత్త సినిమా ప్రకటించలేదు. 'ఉప్పెన' తర్వాత వరుస ప్రభావలే వైష్ణవ్ ని ఇలా ఇరకాటంలోకి నెట్టాయి. కొడితే హిట్ కంటెంట్ తో నే రావాలనే కసి పట్టుదలతో ఏ కథని ఓపట్టాన అంగీకరించలేదని తెలుస్తోంది. ఏడాదిన్నర కాలంలో చాలా కథలు విన్నాడు. ఏదీ నచ్చలేదంట. తనకున్న సోర్సెస్ ద్వారా కొంత మంది వచ్చి కథలు చెబితే....నిర్మాతలు, దర్శకులు, నవతరం నిర్మాత లు నేరుగా ఆయన్ని అప్రోచ్ అయి చెప్పిన వారు మరికొంత మంది. కానీ వాటిలో ఒక్క కథ కూడా వైష్ణవ్ కి నచ్చ లేదు. కొంత మంది కొత్త రచయితల్ని కూడా కలిసి మాట్లాడుట. వాళ్ల దగ్గర ఉన్న కథలు కూడా వినిపించగా పెదవి విరిచేసాడుట. అంటే ఈలెక్కన వైష్ణవ్ తదుపరి సినిమా విషయంలో ఎంత కేర్ ఫుల్ గా ఉన్నాడు? అన్నది అద్దం పడుతుంది. ఇది బాగానే ఉంది. కానీ ఈ జాగ్రత్త భారీ గ్యాప్ ని కూడా క్రియేట్ చేస్తుంది. గత మూడు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. దీంతో మార్కెట్ కూడా డౌన్ ఫాల్ అయింది. తాజాగా ఏర్పడుతోన్న గ్యాప్ తో మార్కెట్ పై మరింత ప్రభావాన్ని చూపిస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరి కొత్త ఏడాదైనా త్వరగా నిర్ణయం తీసుకుంటాడా? లేదా? అన్నది చూడాలి. విరూపాక్ష- తర్వాత సాయి దుర్గ తేజ్ కూడా చాలా సమయం తీసుకుని -సంబరాల ఏటిగట్టు- చిత్రాన్ని ఒకే చేసిన సంగతి తెలిసిందే. -విరూపాక్ష- అతడిని 100 కోట్ల క్లబ్ లో చేర్చిన చిత్రమైన నేపథ్యంలో సాయితేజ్ ఆచితూచి వ్యవరించాడు.



కాలాతీత అందం: దివి వద్త్యా ఆకుపచ్చ చీరలో మెరిసింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com